

జల రాకాసి సునామీకి 20ఏళ్లు !

- ఆసియా అంతటా సంస్మరణ కార్యక్రమాలు

7

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 145 | విజయవాడ, శుక్రవారం 27 డిసెంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 27 December 2024 | Rs

తొలిరోజు చెరో సగం

ఆస్ట్రేలియా 311/6 • బుమ్రాకు మూడు వికెట్లు



బాక్సింగ్ డే టెస్టులో తొలి రోజు ఆస్ట్రేలియా బ్యాటర్లు నలుగురు అర్ధసెంచరీలతో కదం తొక్కారు. నాల్గోటెస్ట్ తొలి రెండు సెషన్లలో ఆసీస్ తొలి రెండు సెషన్లలో ఆధిపత్యం చెలాయించినా.. చివర్లో భారత బౌలర్లు వరుసగా వికెట్లు తీసి కట్టడి చేశారు. బుమ్రా మూడు, సుందర్, జడేజా, ఆకాశ్ దీప్ ఒక్కో వికెట్‌తో సత్తా చాటారు. దీంతో 2వికెట్ల నష్టానికి 237పరుగులతో పటిష్టంగా ఉన్న ఆసీస్ జట్టు స్కోర్ 311 పరుగులకు చేరేసరికి ఆరు వికెట్లను పడగొట్టారు. క్రీజ్‌లో స్మిత్(68), కమిన్స్(8) ఉన్నారు. రెండోరోజు వీరిద్దరినీ త్వరగా పెవీలియన్‌కు చేర్చితే భారత్ పట్టు బిగించడం ఖాయం. వివరాలు 5లో...

మాజీ ప్రధాని

మన్మోహన్ సింగ్ కన్నుమూత



- ఏడు రోజులు సంతాప దినాలు
- రాష్ట్రపతి, ప్రధాని ప్రభృతుల నివాళి

న్యూఢిల్లీ: భారత మాజీ ప్రధానమంత్రి, ప్రఖ్యాత ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ (92) ఇకలేరు. కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఢిల్లీలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ఆసుపత్రిలో గురువారం రాత్రి 9.51 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఈ మేరకు ఎయిమ్స్ మీడియా సెల్ ప్రొఫెసర్ ఇన్‌ఛార్జి డాక్టర్ రిమా దాదా ఒక ప్రకటన విడుదల చేశారు. 'మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఇకలేరని చెప్పడానికి తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాం. వృద్ధాప్య సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన కొంతకాలంగాలో ఇంట్లోనే చికిత్స పొందుతున్నారు. గురువారం నాడు ఉన్నపలంగా స్పృహ కోల్పోయారు. దీంతో ఆయనను రాత్రి 8.06 గంటలకు ఎయిమ్స్‌లోని అత్యవసర వైద్య చికిత్స విభాగానికి తీసుకొచ్చారు. శాయశక్తులా ప్రయత్నించినప్పటికీ ఆయనను కాపాడలేకపోయాం. 9.51 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచినట్లుగా నిర్ధారిస్తున్నాం' అని డాక్టర్ రిమా ప్రకటించారు. మన్మోహన్‌ను ఆసుపత్రికి తరలించారన్న వార్త అందగానే కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, ప్రియాంక గాంధీ తదితరులు హుటాహుటిన ఎయిమ్స్‌కు పరుగులు తీశారు. అప్పటికే ఆయన మరణించారని తెలియడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. సహచర నేతకు సోనియా, మల్లికార్జునఖర్గే ప్రభృతులు ఘన నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కాంగ్రెస్, బిజెపి, సిపిఎంతో పాటు దేశంలోని రాజకీయ పక్షాలు తీవ్ర సంతాపం ప్రకటించాయి. మన్మోహన్‌సింగ్ సింగ్ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభృతులు మిగతా 7లో

దేశం గొప్ప నేతను కోల్పోయింది



దేశ ఆర్థిక వ్యవస్థను సంస్కరించిన గొప్ప ఆర్థిక వేత్తగా మన్మోహన్ చిరస్మరణీయంగా నిలిచిపోతారు, ఆయన మరణం దేశానికి తీరని లోటు దేశం ఒక గొప్ప నేతను కోల్పోయింది

-రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఆర్థికవేత్తగా చెరగని ముద్రవేశారు



అతి సామాన్య వ్యక్తి నుంచి గౌరవప్రదమైన ఆర్థిక వేత్తగా ఆయన ఎదిగారని కొనియాడారు. ఆర్థికమంత్రి సహా వివిధ ప్రభుత్వ పదవుల్లో ఉంటూ దేశానికి ఆర్థిక విధానాన్ని అందజేసి చెరగని ముద్ర వేశారు. పార్లమెంటులో ఆయన చేసిన ప్రసంగాలు సైతం ఎంతో అర్థవంతమైనవి.

-ప్రధాని నరేంద్ర మోడీ

నిబద్ధత కలిగిన లౌకికవాది : సిపిఎం



మన్మోహన్‌సింగ్ మరణం పట్ల సిపిఎం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసింది. మన్మోహన్ సింగ్ నిబద్ధత కలిగిన లౌకిక, ప్రజాస్వామ్యవాది అని, భారతదేశ భిన్నత్వంలో ఏకత్వమనే భావన పట్ల బలమైన విశ్వాసం కలిగిన నేత అని సిపిఎం పేర్కొంది. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపింది.

మన్మోహన్ గొప్ప మేధావి



మన్మోహన్ ఒక మేధావిగా, ప్రభుత్వాధినేతగా అనేక సేవాలందరించారు. వినయం, వివేకం, సమగ్రత మూర్తీభవించిన ఆర్థికవేత్త. అలుపెరగనిరీతిలో దేశానికి సేవ చేశారు.మన్మోహన్ మరణం దేశానికి తీరని లోటు.

ముఖ్యమంత్రి చంద్రబాబు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బివి.రాఘవులు, పక్కన ఎంఎ.బేబీ, శ్రీనివాసరావు

జమిలితో ప్రజాస్వామ్యానికి ముప్పే

- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు
- మోడీ హయాంలో మైనార్టీలపై దాడులు : ఎంఎ బేబీ

ప్రజాశక్తి - నరసాపురం, యలమంచిలి

జమిలి ఎన్నికలతో రాష్ట్రాల హక్కులు దెబ్బతింటాయని, ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడుతుందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పట్టణంలో జరుగుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలకు విచ్చేసిన ఆయన సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, కేరళ విద్యాశాఖా మంత్రి ఎంఎ.బేబీ, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల ముగిసిన పార్లమెంట్ సమావేశాల్లో జమిలి ఎన్నికలే లక్ష్యంగా 129వ రాజ్యాంగ సవరణ బిల్లును సైతం మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. అలాగే కేంద్రపాలిత ప్రాంతాల సవరణ బిల్లును ప్రవేశపెట్టిందని, జమిలి ఎన్నికలతో ప్రాంతీయ పార్టీలు నిర్వీర్యమవుతాయన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక వల్ల సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందని ప్రచారం చేస్తున్నారని, వాస్తవానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు తగ్గదన్నారు. ఈ తరహా ఎన్నికల వల్ల ఒక కేంద్రీకృత, నియంతృత్వ ప్రభుత్వం రాజ్యమేలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఫలితంగా ఎంతో ప్రతిష్టగా చెప్పుకునే మన దేశ ప్రజాస్వామ్యం దెబ్బతింటుందని అన్నారు. జమిలి ఎన్నికలను ప్రజలంతా వ్యతిరేకించాలని కోరారు. జమిలి విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు మోడీని ప్రశ్నించకపోవడం బాధాకరమన్నారు. టిడిపి, జనసేన, వైసిపి రాష్ట్ర ప్రయోజనాలు పక్కనపెట్టి మోడీ భజన చేస్తున్నాయని విమర్శించారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హోం మంత్రి అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలని, ఆయనపై ప్రధాని మోడీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలు మిగతా 5లో



ఉద్యోగార్థులపై లాఠీలు ఝుళిపిస్తున్న పోలీసులు

ఉద్యోగార్థులపై విరిగిన లాఠీ

- బీహార్‌లో పోలీసుల దాష్టీకం
- పరీక్షా పత్రం లీక్‌పై ప్రశ్నించడమే నేరమా?
- లాలూ, రాహుల్, తేజస్వీ తదితరుల ఖండన

పాట్నా : బీహార్‌లో ఉద్యోగార్థులపై లాఠీ విరిగింది. పరీక్షా పత్రం లీకేజిని ప్రశ్నించడమే నేరమన్నట్టు పోలీసులు విరుచుకుపడ్డారు. ప్రశ్నా పత్రం లీకైనందున పరీక్షను రద్దు చేయాలని కోరుతూ ఉద్యోగార్థులు ఆందోళనకు దిగారు. పోలీసుల పైశాచిక లాఠీచార్జిలో పలువురు తీవ్రంగా గాయడ్డారు. ఉద్యోగార్థులపై దాడిని లాలూ ప్రసాద్ యాదవ్, రాహుల్ గాంధీ, తేజస్వి యాదవ్ తదితరులు తీవ్రంగా ఖండించారు. బీహార్ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ 36 జిల్లాల్లోని 912 పరీక్షా కేంద్రాల్లో ఈనెల 13న నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ కంబైన్డ్ కాంపిటిటీవ్ ఎగ్జామినేషన్ (సిసిఇ)కు దాదాపు 4 లక్షల 80 వేల మంది అభ్యర్థులు హాజరయ్యారు.సబ్-డివిజనల్ ఆఫీసర్, సీనియర్ డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వంటి 2035 గ్రూప్ -1, మిగతా 7లో

త్యాగాలు, పోరాటాలకు సిద్ధం కండి

- సిపిఐ శత వార్షికోత్సవ సభలో రామకృష్ణ పిలుపు

3

'సినిమా' సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం

- చట్టాన్ని అమలు చేయడం సిఎంగా నా బాధ్యత
- సినీ ప్రముఖుల భేటీలో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి

2

సమ్మె ఒప్పందాలు అమలు చేయాల్సిందే


- పలుచోట్ల మున్సిపల్ కార్మికుల ధర్నాలు

2

చేసిన తప్పును అంగీకరించడానికి

మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదు

- సిడబ్ల్యుసి సమావేశాలను ప్రారంభించిన ఖర్గే



'నవ సత్యాగ్రహ బైఠక్'లో మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ తదితరులు

బెలగావి : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను అవమానపరిచేలా వ్యాఖ్యలు చేయడం ద్వారా కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన తప్పును అంగీకరించడానికి ప్రధాని మోడీ, ఆయన ప్రభుత్వం సిద్ధంగా లేరని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే గురువారం విమర్శించారు. రాజ్యాంగ నిర్మాత అంబేదర్కర్ గౌరవం కోసం తమ పార్టీ పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. బెలగావిలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని మహాత్మా గాంధీ స్వీకరించి వందేళ్ల పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సమావేశం 'నవ సత్యాగ్రహ బైఠక్'ను ప్రారంభిస్తూ ఖర్గే ప్రసంగించారు. రాజ్యాంగ సంస్థలను నియంత్రిసున్నారని, ఎన్నికల కమిషన్ అందుకు ఉదాహరణ అని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిష్పాక్షికతపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నందున ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతోందని, ఇది ఆందోళన కలిగించే అంశమని ఖర్గే పేర్కొన్నారు. కొద్ది రోజుల క్రితమే వారు ఎన్నికల నిర్వహణ నిబంధనలను సవరించారని, ప్రజలకు తెలియచేయాలని కోర్టు ఆదేశించే సమాచారాన్ని ఇకపై షేర్ చేయడాన్ని నిలువరించేలా ఈ సవరణ తీసుకువచ్చారని అన్నారు. అయినా వారు దాచడానికి ప్రయత్నిస్తున్న విషయం ఏమిటని ఖర్గే ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలో తొలగింపులు, ఒక్కసారే పెరిగిపోయే ఓటర్లు, చివరి నిముషంలో అసాధారణంగా పెరిగే ఓటింగ్ శాతం ఇలా కొన్ని ప్రశ్నలు తలెత్తుతున్నాయని, వీటి విషయంలో సంతృప్తికరమైన సమాధానం లభించడం లేదన్నారు. తప్పు చేసిన అమిత్ షాను క్షమాపణ చెప్పాలని, రాజీనామా చేయాలని కోరడానికి బదులుగా మోడీ ప్రభుత్వం సమర్థిస్తోందని ఖర్గే విమర్శించారు.

రాబోయే కొత్త ఏడాది 2025 పార్టీ సంస్థాగత సాధికారత సంవత్సరంగా వుండనుందన్నారు. పార్టీలో ఖాళీగా వున్న పదవులను భర్తీ చేస్తామన్నారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను పూర్తిగా మిగతా 7లో



రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకుంటున్న జెస్సిరాజ్


రాష్ట్రపతి చేతులమీదుగా జెస్సిరాజ్‌కు అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు

దేశంలోని సాహస బాలలకు కేంద్రం ప్రభుత్వం అందజేస్తున్న ప్రధాన మంత్రి బాలపురస్కార్ అ వార్డుకు ఎంపికైన గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన మాత్రపు జెస్సిరాజ్ గురువారం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. న్యూజిల్యాండ్‌లో నిర్వహించిన ప్రపంచ ఆర్టిస్టిక్ స్కేటింగ్ పోటీల్లో దేశం తరపున పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించినందుకు గాను జెస్సిరాజ్ ఈ అవార్డుకు ఎంపికైన విషయం విదితమే.

స్టార్టప్‌లకు గడ్డుకాలం

- నిధుల సమీకరణలో సవాళ్లు
- డిసెంబర్ త్రైమాసికంలో 47 శాతం పతనం
- మూడేళ్ల కనిష్టానికి పెట్టుబడులు
- ట్రాక్సన్ రిపోర్ట్ వెల్లడి



బెంగళూరు : భారత్‌లోని స్టార్టప్ సంస్థలు గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ దూసుకుపోతోందని మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి, స్టార్టప్‌ల్లో నెలకొన్న వాస్తవ పరిస్థితికి చాలా వ్యత్యాసం కనపడుతోంది. ఒకప్పుడు భారతీయ టెక్ వెంచర్లలో వందల కోట్ల డాలర్లు పెట్టుబడిగా పెట్టడానికి ఆసక్తి చూపిన విదేశీ ఇన్వెస్టర్లు ఇటీవల కాలంలో దానికి భిన్నమైన వైఖరిని అవలంభిస్తున్నారు. దీంతో ఔత్సాహిక వ్యాపారవేత్తలకు నిధుల కొరత వెంటాడుతోంది. ఈ ఏడాది అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో భారత్ స్టార్టప్‌లలో పెట్టుబడులు భారీగా తగ్గాయని ట్రాక్సన్ (అంతర్జాతీయంగా స్టార్టప్‌లపై అధ్యయన సంస్థ) గురువారం ఓ నివేదికలో వెల్లడించింది. ప్రస్తుత క్యూ4లో 1.8 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.15,350 కోట్లు) నిధులు సమకూరాయి. గత మూడేళ్లకాలంలో ఇదే అత్యంత తక్కువ కావడం గమనార్హం. సెప్టెంబర్ త్రైమాసికంలోని 3.5 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.29,845 కోట్లు) నిధుల సమీకరణతో పోల్చితే క్యూ4 నిధుల్లో 47.5 శాతం పతనం చోటు చేసుకుంది. 2023 క్యూ4లోని 2.7 బిలియన్ డాలర్ల (రూ.23వేల కోట్లు)తో పోల్చినా 33.3 శాతం క్షీణత నమోదైందని ట్రాక్సన్ తన వార్షిక రిపోర్ట్‌లో వెల్లడించింది. 2021లో మొత్తంగా 37.2 బిలియన్ డాలర్ల నిధుల సమీకరణ జరగ్గా.. 2022లో 25.4 బిలియన్ డాలర్లు, 2023లో 10.7 బిలియన్లు మాత్రమే స్టార్టప్‌లకు నిధులు చేరాయి. 2024లో స్టార్టప్‌ల తొలిసారి నిధుల సమీకరణలో 40 శాతం తగ్గుదల నమోదైంది. అంటే కొత్త స్టార్టప్‌లు మరింత గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నాయని స్పష్టమవుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న బలహీనతలు, డిమాండ్‌లో తగ్గుదల స్టార్టప్ నిధులకు ప్రధాన సవాళ్లుగా నిలుస్తున్నాయని నిపుణులు భావిస్తున్నారు.

వాస్తవం బోధపడుతోంది : రాధికా గుప్తా

ప్రస్తుత స్టార్టప్‌ల పరిస్థితిపై ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ సిఇఒ, ఎమ్‌డి రాధికా గుప్తా కీలకవ్యాఖ్యలు చేశారు. స్టార్టప్‌ల ఉచ్చులో పడకండని.. త్వరలోనే వీటి వాస్తవం బోధపడుతోందని యువతను ఉద్దేశించి ఆమె పేర్కొన్నారు. అంతంతమాత్రం నిధుల లభ్యత, పరిమిత పని పరిస్థితులు, తిరస్కరణలు, నియామకాల్లో సవాళ్లు, అనిశ్చిత పరిస్థితులు, ఒత్తిడి తదితర సవాళ్లు ఈ రంగంలో నెలకొన్నాయని ఆమె తెలిపారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మాజీ సిఎం జగన్

ప్రజా సమస్యలపై పోరాటం చేద్దాం

- మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ప్రజాదర్బార్‌లో తోపులాట, లాఠీఛార్జి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

'అధైర్య పడకండి మీకు నేను తోడుగా ఉంటాను. సమస్యలు ఉంటే నేరుగా నాతో చెప్పండి. వచ్చే ఎన్నికల్లో గెలిచేది మనమే. సమస్యలపై పోరాటం చేద్దాం' అని కార్యకర్తలు, ప్రజలనుద్దేశించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నాలుగు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా మూడో రోజు పులివెందులలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఆయనను కలిసి సమస్యలను తెలియజేశారు. జగన్ స్పందిస్తూ న్యాయం జరగకపోతే పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వారికి భరోసా ఇచ్చారు. ఇకపై ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన ప్రజలు, వైసిపి శ్రేణుల సమ స్యలను ఓపిగ్గా వింటూ తోడుగా ఉంటానని వారికి భరోసానిచ్చారు. ప్రజలు ఈ సందర్భంగా పింఛను తొలగింపు, విద్యుత్ ఛార్జీలు పెంపు తదితర సమస్య లను జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలు మిగతా 7లో

'చెరుకుమల్లి'కి మంత్రి అచ్చెన్న శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (ఎఐఆర్‌ఐ) డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన చెరుకుమల్లి శ్రీనివాసరావుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఎఐఆర్‌ఐ డైరెక్టర్‌గా కృష్ణాజిల్లాకు చెందిన శ్రీనివాసరావు నియమితులవడం తెలుగు ప్రజలకే గర్వకారణమని గురువారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం సర్వతోముఖాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తారని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

ఎపిఎండిసిలో సలహాదారు నియామకానికి అనుమతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎండిసికి నిధుల సేకరణ కోసం ఆర్థిక సలహాదారులు (అడ్వైజర్ కమ్ మర్చెంట్ బ్యాంకర్) నియామకానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. మైనింగ్ కార్పొరేషన్‌కు సాధారణ మూలధనం, కార్పొరేట్ పర్పస్ కోసం రూ.5 వేల కోట్లను సేకరించేందుకు అవసరమైన రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్‌పిఎఫ్) డాక్యుమెంట్ సిద్ధం చేయడానికి, ఆర్థిక నిపుణులైన సలహాదారు నియామకం కోసం, టెండర్ల ప్రక్రియను పూర్తిచేయడం కోసం కార్పొరేషన్‌కు అనుమతిస్తూ గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు ఆరుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. వీరిలో ఎపిఎండిసి ఎమ్‌డి, ఇడి, పరిశ్రమల శాఖ ఉప కార్యదర్శి, జనరల్ మేనేజర్, పిపిపి ఎక్స్‌పర్ట్ షాలీంరాజు, ఎపిఎండిసి డిజిఎం ఉంటారని పేర్కొన్నారు. ఏడు రోజుల సమయంలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

విశాఖ ఉక్కు సెయిల్‌లో విలీనం : షర్మిల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, ప్లాంట్ అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వై.ఎస్ షర్మిల గురువారం ప్రకటన విడుదల చేశారు. కర్ణాటక స్టీల్ ప్లాంట్‌కు రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం ఇచ్చినట్లు, వైజాగ్ ప్లాంట్‌కు నిధులు ఇవ్వాలన్నారు. నిధులు సాధించకపోతే ఎన్‌డిఎ కూటమి నుంచి టిడిపి, జనసేనలు తప్పుకోవాలని కోరారు. విశాఖ ఉక్కును ఉద్ధరిస్తున్నట్లు కేంద్రం చెప్పేవన్నీ అసత్యాలేనన్నారు. స్టీల్ ప్లాంట్ మీద కేంద్రానికి ఉండేది వివక్షేనని అన్నారు. కన్నడ ఉక్కు ఫ్యాక్టరీపై ప్రధాని మోడీకి ఉన్న దృష్టి విశాఖ ఉక్కుపై ఎందుకు లేదని ప్రశ్నించారు. విశాఖ స్టీల్‌ను దివాలా తీయించే ఎత్తుగడలు సాగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. దీనిని మోడీగారి దోస్తులకు కట్టబెట్టే కుట్రలు జరుగుతున్నాయని చెప్పారు. 243 మంది పని చేసే కర్ణాటక స్టీల్ ప్లాంట్‌కు పెద్ద మొత్తంలో నిధులు ఇచ్చిన కేంద్రానికి, 26 వేల మంది పని చేసే విశాఖ స్టీల్‌ను ఆదుకోవడానికి మనసు రావడం లేదన్నారు. 1400 రోజులుగా స్టీల్ ప్లాంట్‌ను ఆదుకోవాలని కార్మికులు ఉద్యమాలు చేస్తుంటే... ఈ విషయాన్ని పట్టించుకోని సిఎం చంద్రబాబు ప్రధాని మోడీతో మిట్టల్ స్టీల్ గురించి చర్చించడం విడ్డూరంగా ఉందన్నారు.

మైనర్, మీడియం స్కూల్ కాంప్లెక్స్‌లు కొనసాగింపు

- స్కూల్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉన్న మైనర్, మీడియం (ఒరియా, తమిళం, కన్నడ, ఉర్దూ) స్కూల్ కాంప్లెక్స్‌లు కొనసాగించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకూ ప్రత్యేకంగా మైనర్, మీడియం ఉపాధ్యాయులకు జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్‌లను రద్దు చేసి పునరవ్యవస్థీకరణలో భాగంగా మైనర్, మీడియం స్కూల్ కాంప్లెక్స్‌ల ఉపాధ్యాయులను వివిధ తెలుగు స్కూల్ కాంప్లెక్స్‌లలో విలీనం చేయడం వల్ల వీరు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. మైనర్, మీడియం ఉపాధ్యాయులు ప్రథమ భాష, ఇతర సబ్జెక్టులు ఒరియా, తమిళం, కన్నడ, ఉర్దూ మాధ్యమంలో బోధిస్తారని, వీరిని తెలుగు మాధ్యమం కాంప్లెక్స్‌లలో కలపడం వల్ల నిర్దిష్టమైన, విద్యా పరమైన లక్ష్యాలు నెరవేరవన్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని పరిశీలించి మైనర్, మీడియం ఉపాధ్యాయులకు వేరుగా కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.



జగన్నాథం ఆరోగ్యం గురించి డాక్టర్లను అడిగి తెలుసుకుంటున్న హరీశ్‌రావు

మందా జగన్నాథం ఆరోగ్యం విషమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుండె సంబంధిత సమస్యతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగర్ కర్నూల్ మాజీ ఎంపి మందా జగన్నాథం ఆరోగ్యం అత్యంత విషమంగా ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఆయన నిమ్స్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి హరీశ్ రావు వెంటనే నిమ్స్ ఆస్పత్రికి వెళ్లి మందా జగన్నాథంను పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న నాయకులు

గొప్ప నిష్కళంక దేశభక్తుడు 'రామం'

- పుస్తకావిష్కరణ సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు
- వీరోచిత పోరాట యోధుడు రామం : ఎంఎ బేబీ

ప్రజాశక్తి - నరసాపురం

గొప్ప నిష్కళంక దేశభక్తుడు ఉద్దరాజు రామం అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఎంపి, సిపిఎం నేత ఉద్దరాజు రామం జీవన యానంపై ప్రచురించిన 'ఉద్యమాల శిఖరం.. ఉద్దరాజు రామం' పుస్తకాన్ని రాఘవులు ఆవిష్కరించారు. స్థానిక అల్లూరి సత్యనారాయణరాజు సాంస్కృతిక కేంద్రంలో గురువారం సాయంత్రం జరిగిన పుస్తకావిష్కరణ సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన స్వాతంత్ర్య పోరాటంలో అత్యంత ధైర్య సాహసాలను ప్రదర్శించారన్నారు. అనేక సంవత్సరాలు జైలులో నిర్బంధించినా పట్టుదలతో ఉద్యమాన్ని కొనసాగించారని చెప్పారు. కుల వివక్షకు వ్యతిరేకంగా సుందరయ్యతో కలిసి ఉద్దరాజు రామం గొప్ప పోరాటం చేశారని కొనియాడారు. ప్రస్తుతం దేశంలో మత వివక్ష పెరుగుతోందని, ఈ పోకడలకు వ్యతిరేకంగా పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ.బేబీ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్రం కోసం సోషలిస్టులు, కమ్యూనిస్టులు, ఇతర అనేక శక్తులు పోరాటం జరిపాయని గుర్తు చేశారు. ఆ పోరాటంలో వీరోచితంగా పాల్గొన్న నాయకుడు ఉద్దరాజు రామం అని కొనియాడారు. కేరళ రాష్ట్రంలో ఇఎంఎస్. నంబూద్రిపాద్ నాయకత్వాన తొలి కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడిందని, ఆ ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్య విరుద్ధంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేసిందన్నారు. ఆ సమయంలో ఉద్దరాజు రామం పార్లమెంట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ చర్యను తీవ్రంగా నిలదీశారని గుర్తు చేశారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎంఎ.గఫూర్, మంతెన సీతారాం, డి.రమాదేవి, కె.సుబ్బరావమ్మ, ప్రముఖులు డివిఎస్.వర్మ, సీనియర్ జర్నలిస్టు ఎం.కోటేశ్వరరావు, రామం తనయుడు ఉద్దరాజు బాపిరాజు, మనవరాలు శారద తదితరులు మాట్లాడారు.



నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

సమ్మె ఒప్పందాలు అమలు చేయాల్సిందే

- పలుచోట్ల మున్సిపల్ కార్మికుల ధర్నాలు

ప్రజాశక్తి-యంత్రాగం

సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు పలుచోట్ల గురువారం ధర్నాలు చేపట్టారు. ఉద్యోగ భద్రత, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, రక్షణ పరికరాలు, పనిముట్లు, ఇఎస్‌ఐ, పిఎఫ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. గతేడాది సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు దశల వారిగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. విశాఖలోని జివిఎంసి గాజువాక జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గతేడాది సమ్మె సందర్భంగా చేసిన రాతపూర్వక ఒప్పందాలను అమలు చేయాలని, 12వ పిఆర్‌సి విడుదల చేయాలని నినదించారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టారు. ఈ ధర్నాల్లో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఎ.జగన్మోహనరావు, మన్యం జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు పాల్గొని మాట్లాడారు. అనంతపురం కార్పొరేషన్‌తోపాటు రాయదుర్గం, కళ్యాణదుర్గం, గుంతకల్లు, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో ధర్మవరం, హిందూపురం తదితర మున్సిపాలిటీల్లో ఆందోళనలు చేపట్టి అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. హామీలను అమలు చేసేలా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలంటూ కమిషనర్లకు వినతపత్రాలు అందజేశారు. నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నాలో యూనియన్ నగర గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి కె.పెంచల నరసయ్య తదితరులు పాల్గొన్నారు. సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని మేయర్ పొట్లూరి స్రవంతి, కమిషనర్ సూర్య తేజలకు వినతి పత్రాలు అందించారు.

విద్యుత్ చార్జీలపై ధర్నా తుగ్లక్ చర్య : మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ఛార్జీలపై వైసిపి ధర్నాలకు పిలుపుఇవ్వడాన్ని తుగ్లక్ చర్యగా రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అభివర్ణించారు. గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాజీ సిఎం జగన్ తాను పెంచిన చార్జీలపై తానే ధర్నాలకు దిగుతున్నారని పేర్కొన్నారు. 2019లో టిడిపి అధికారం కోల్పోయే నాటికి రాష్ట్రం మిగులు విద్యుత్ కలిగి ఉందని, జగన్ అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రం అధోగతి పాలయ్యిందని తెలిపారు. అమలులో ఉన్న పిపిఎలను రద్దు చేయడంతోపాటు సోలార్, విండ్ ఎనర్జీ సంస్థల నిర్వాహకులను బెదిరించి వారిని రాష్ట్రం నుంచి వెళ్లగొట్టారని పేర్కొన్నారు. దీంతో 10 వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను కోల్పోయినట్లు చెప్పారు. ఎపి జెన్కోను కావాలని దెబ్బతీసి, విద్యుత్ లోటు పేరుతో విజయసాయిరెడ్డి అండ్ కో నుంచి అధిక రేట్లకు విద్యుత్ కొనుగోలు చేశారన్నారు. యూనిట్ ధర రూ.5లకు అందుబాటులో ఉన్నా, కమీషన్ల కోసం బహిరంగ మార్కెట్‌లో రూ.8 నుంచి 14 వరకూ గత ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు . వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వం 2021-22కి ఎపిఇఆర్‌సి ఆమోదించిన ట్రూఅప్ చార్జీలు రూ.3,082 కోట్లు ప్రజలపై భారం వేశారన్నారు. 2022-23కి రూ.6,073 కోట్లు, 2023-24కి రూ.9,412 కోట్లు ట్రూఅప్ చార్జీలకు ఎపిఇఆర్‌సి ఆమోదం తెలిపిందని, ఎన్నికల ముందు భారం వేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని వాయిదా వేశారన్నారు. ఆ చార్జీలనే ఇప్పుడు వసూలు చేస్తుంటే, ధర్నాలు చేయాలని జగన్ పిలుపునివ్వడాన్ని తప్పుబట్టారు.

'సినిమా' సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం

- చట్టాన్ని అమలు చేయడం సిఎంగా నా బాధ్యత
- సినీ ప్రముఖుల భేటీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



సిఎంతో భేటీ అయిన సినీ ప్రముఖులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'సినీ పరిశ్రమ సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తాం. పరిశ్రమ కూడా ఓ కమిటీని ఏర్పాటు చేసుకొని సమన్వయంతో ముందుకెళ్లాలి. తెలుగు సినిమా పరిశ్రమ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి. సినిమాలకు మా ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం ఇచ్చింది. ఐటీ, ఫార్మాతో పాటు సినిమా పరిశ్రమ కూడా మాకు ముఖ్యమే. ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం అందిస్తాం. వ్యక్తిగతంగా నాకు ఇష్టా ఇష్టాలేమీ లేవు. ముఖ్యమంత్రిగా చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత నాపై ఉంది. శాంతిభద్రతల విషయంలో రాజీలేదు. రాష్ట్ర అభివృద్ధిలో సినీ పరిశ్రమ భాగస్వామ్యం కావాలి' అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్‌లో తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్‌రాజు నేతృత్వంలో పలువురు సినీ ప్రముఖులతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డిజిపి జితేందర్‌తో కలిసి సిఎం సమావేశమయ్యారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట, అల్లు అర్జున్ అరెస్ట్ అనంతర పరిణామాల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో పలువురు సినీ ప్రముఖులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. అనంతరం సిఎం మాట్లాడుతూ "సినీ పరిశ్రమ అభివృద్ధిపై అనుమానాలు, అపోహలు వద్దు. మా ప్రభుత్వం ఇండస్ట్రీకి ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. సినీ పరిశ్రమను ప్రోత్సహించడమే మా ముఖ్య ఉద్దేశం. రాష్ట్రంలో ఎనిమిది సినిమాలకు మా ప్రభుత్వం ప్రత్యేక జీవోలు ఇచ్చింది. పుష్ప సినిమాకు పోలీసు గ్రౌండ్ కేటాయించాం. తెలుగు ఇండస్ట్రీకి ఒక బ్రాండ్ సృష్టించాలనే ఈ నిర్ణయం తీసుకున్నాం. తెలంగాణలో అవార్డులు ఇవ్వడం లేదని తెలిసి గద్దర్ అవార్డును తీసుకొచ్చాం. రాష్ట్రంలో ఎక్కడైనా షూటింగ్ చేసుకుని హైదరాబాద్‌కు రెండు గంటల్లో వచ్చే సౌకర్యం ఉంది. కాస్మోపాలిటన్ సిటీల్లో హైదరాబాద్ బెస్ట్ సిటీ. హాలీవుడ్, బాలీవుడ్ హైదరాబాద్ వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. పరిశ్రమను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లడమే మా ఉద్దేశం" అని సిఎం వారికి వివరించారు. ముఖ్యమంత్రిగా చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యతే తప్ప, వ్యక్తిగత ఇష్టాయిష్టాలు నాకు లేవని వ్యాఖ్యానించారు. 'తెలుగు పరిశ్రమ తెలుగుకే పరిమితం కాకుండా అంతా కలిసి అభివృద్ధి చేద్దాం. మా ప్రభుత్వం సినిమా పరిశ్రమకు అండగా ఉంటుంది. సినిమా పరిశ్రమ కూడా తమ సామాజిక బాధ్యతను గుర్తు పెట్టుకోవాలి. ప్రభుత్వ కార్యక్రమాల్లో, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి. గంజాయి, డ్రగ్స్‌తో పాటు సామాజిక అంశాలపైన సినిమా పరిశ్రమ ప్రచారం చేయాలి. తెలంగాణలోని ఎకో టూరిజం, టెంపుల్ టూరిజాన్ని ప్రమోట్ చేయండి' అని సిఎం వారికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అక్కినేని నాగార్జున, వెంకటేశ్, నితిన్, సాయిధరమ్‌తేజ్, రాఘవేంద్రరావు, అల్లు అరవింద్, సి.కల్యాణ్, నాగవంశీ, గోపీ ఆచంట, బివిఎన్ ప్రసాద్, వంశీ పైడిపల్లి, నవీన్, రవిశంకర్, త్రివిక్రమ్, మురళీ మోహన్, హరీశ్ శంకర్, కొరటాల శివ, బోయపాటి శ్రీను, వేణు యెల్దండి, కిరణ్ అబ్బవరం తదితర సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

అవినాష్‌రెడ్డి పిఎ కేసుపై 7న తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

సోషల్ మీడియాలో పోస్టులు ఏమీ పెట్టకపోయినప్పటికీ తనను అన్యాయంగా ఎస్‌సి, ఎస్‌టి కేసులో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారని కడప ఎంపి అవినాష్‌రెడ్డి పర్సనల్ సెక్రటరీ బండి రాఘవరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు జనవరి 7న తీర్పు చెప్పనుంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వి.రవీందర్‌రెడ్డి వాంగ్మూలం పేరుతో పిటిషనర్‌ను అరెస్టు చేసేందుకు కుట్ర జరుగుతోందని, ముందస్తు బెయిల్ ఇవ్వాలని సీనియర్ లాయర్ మనోహర్‌రెడ్డి కోరారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఎస్‌సి, ఎస్‌టి కేసులో కూడా ముందస్తు బెయిల్ ఇవ్వొచ్చునని చెప్పారు. పోలీసుల తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ ప్రతివాదన చేస్తూ, పులివెందుల పోలీసులు పెట్టిన కేసులో పిటిషనర్ నిందితుడు కాదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో నిందితులు సంబంధిత కోర్టుల్లోనే ముందస్తు బెయిల్ పిటిషన్ వేసుకోవాలన్నారు. వాదనల తర్వాత హైకోర్టు తీర్పును జనవరి 7న చెబుతామని వెల్లడించింది.

ప్రభావతి ముందస్తు బెయిల్ పిటిషన్ 30కి వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

కనుమూరి రఘురామకృష్ణరాజు ఫిర్యాదు మేరకు గుంటూరు, నగరపాలెం పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు నేపథ్యంలో తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని గుంటూరు ప్రభుత్వాసుపత్రి అప్పటి సూపరింటెండెంట్ నీలం ప్రభావతి వేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 30కి వాయిదా పడింది. గత ప్రభుత్వంలో పోలీసులు అన్యాయంగా కేసులో ఇరికించి, తనను చిత్రహింసలకు గురిచేశారని రఘురామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. సీనియర్ న్యాయవాది వాదనలు వినిపించేందుకు వీలుగా విచారణను వాయిదా వేయాలని పిటిషనర్ న్యాయవాది కోరడంతో విచారణ ఈ నెల 30కి వాయిదా వేస్తూ జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తనను సిఐడి పోలీసులు కస్టోడియల్ వేధింపులకు గురిచేయడమే కాకుండా గాయపర్చారని, ఎలాంటి గాయాలు లేవంటూ ప్రభావతి తప్పుడు వైద్య నివేదిక ఇచ్చారని ఆ ఫిర్యాదులో రఘురామ పేర్కొన్నారు. ప్రభావతిని పోలీసులు నిందితులుగా చేర్చడంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు.

29 ఏళ్లలో చెల్లించాలి

- అమరావతి అప్పుపై సిఆర్‌డిఎకు ప్రపంచబ్యాంకు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతికి తాము ఇస్తున్న రుణాన్ని ఆరు సంవత్సరాల గ్రేస్ పీరియడ్‌తో 29 ఏళ్లలో చెల్లించాలని ప్రపంచబ్యాంకు తెలిపింది. ఈ మేరకు సిఆర్‌డిఎకు ప్రపంచబ్యాంకు లేఖ రాసింది. అమరావతి ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్ కింద 800 అమెరికన్ మిలియన్ డాలర్ల రుణాన్ని ప్రపంచబ్యాంకు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై కొద్దికాలంగా సంప్రదింపులు జరుగుతున్నాయి. ఇస్తున్న రుణం ఎంతకాలంలో చెల్లించాలనే అంశంపై ఇప్పటి వరకూ స్పష్టత లేదు. అయితే, గురువారం విడుదల చేసిన లేఖతో దీనిపై స్పష్టత వచ్చింది. సంస్థాగత అభివృద్ధి కోసం ప్రపంచబ్యాంకు ఈ రుణం ఇస్తున్నట్లు పేర్కొన్న సంగతి తెలిసిందే. సమర్థవంతమైన సదుపాయాలు కల్పించడం, సంస్థలను ఏర్పాటు చేయడం, ఉద్యోగాలు, ఉపాధి కల్పనను పెంచేందుకు సిఆర్‌డిఎ ఇచ్చిన సూచనలను బ్యాంకు డైరెక్టర్లు ఆమోదించారని, వాటికోసం ప్రైవేటు రంగాన్ని ఎక్కువగా ఉపయోగించుకోవడం ద్వారా సకాలంలో ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించాలని ఈ లేఖలో పేర్కొన్నారు. దీనిపై నిరంతరం వచ్చే గ్రీవెన్స్‌ను తనిఖీ చేస్తూ ఉంటామనీ అందులో పేర్కొన్నారు. రాజధానిలో పనులు జరిగే సమయంలో వచ్చే సమస్యలను సున్నితంగా పరిష్కరించే విధంగా కార్యాచరణ ఉండాలని తెలిపారు. ఐదేళ్లలో రాజధానికి రూపురేఖలు తీసుకువస్తే ప్రైవేటు కంపెనీలు, సంస్థలు ఇక్కడ తమ కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఉపాధి పెరుగుతుందని, దీనివల్ల భూములకు విలువ పెరిగి కొంత ఆదాయమూ వస్తుందని ప్రభుత్వం అంచనాతో ఉంది. పన్నుల ద్వారా వచ్చే ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుందని అధికారులు తెలిపారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

- సిఎంకు వి.శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించి ఐదు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న క్లెయిములను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి గురువారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో దాదాపు 20 లక్షల మంది భవన నిర్మాణరంగంలో ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వం ఇసుక విధానంపై అవలంబించిన విధానం వల్ల సరైన ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సంక్షేమ బోర్డు నుండి పథకాలు అమలు కావడం లేదని, సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న క్లెయిములను అన్నిటినీ వెంటనే చెల్లించాలని కోరారు. సంక్షేమ బోర్డు నుండి ప్రభుత్వం వాడుకున్న సొమ్ములను జమచేయాలని, వసూలు చేయాల్సిన నిధి బకాయిలను సంబంధిత సంస్థల నుండి వసూలు చేయాలని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో నిధులున్నా అమలు చేయాల్సిన సంక్షేమ పథకాలను ఆపడం వల్ల కార్మికుల నష్టపోతున్నారని తెలిపారు. దీనివల్ల చనిపోయిన గాయపడిన కార్మికులకు ఇతర క్లెయిములకు ఎటువంటి నష్టపరిహారమూ అందడం లేదని వివరించారు. కోట్లాది రూపాయల నిర్మాణాలు, రోడ్లు నిర్మిస్తున్న కాంట్రాక్టర్ల నుండి వసూలు చేయాల్సిన భవన నిర్మాణ సెస్ వసూలు చేయడం లేదని పేర్కొన్నారు. ఈ సెస్‌తోనే కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఈసెస్‌కు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేది ఏమీ లేదని భవన నిర్మాణ సంక్షేమ బోర్డులోని నిధిని ప్రభుత్వాలే పక్కదోవ పట్టిస్తున్నాయని తెలిపారు. ఈ అంశాలను పరిశీలించి పెండింగ్ క్లెయిములను తక్షణమే చెల్లించేలా 50 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు.

వెలుగు యానిమేటర్ల ఉద్యోగ భద్రత, బకాయి వేతనాల సమస్య పరిష్కరించాలి

- సిఎంకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వెలుగు యానిమేటర్ల (విఓఎ)ల ఉద్యోగ భద్రత, బకాయి వేతనాలు తదితర సమస్యలు పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి లేఖ రాశారు. రాష్ట్రవ్యాప్తంగా వెలుగు యానిమేటర్లు గ్రామీణ ప్రాంతాల్లో అనేక సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నారని, వీరంతా గ్రామ సంఘాల, మహిళా పొదుపు సంఘాలను బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని వివరించారు. అనేక రకాల సేవలను వీరంతా అందిస్తున్నారని, కనీస వేతనాలు చెల్లించడం లేదని పేర్కొన్నారు. రాజకీయ వేధింపులు ఎక్కువగా ఉన్నాయని, కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని కోరారు. బకాయిలు వేతనాలు వెంటనే చెల్లించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, టిఎ, డిఎ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. రంపచోడవరం పరిధిలో ఉన్న 11 మండలాల్లో ఏడు నుండి 17 నెలల వేతనాలు బకాయిలు ఉన్నాయని, ఉద్యోగులు, అధికారులకు ఎన్ని వినతిపత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. మహిళా మార్టుల పేరుతో బలవంతంగా సరుకుల కొనుగోళ్లు చేయిస్తున్నారని, ఈ సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించేలా సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

రాజధానిలో లేఅవుట్ల అభివృద్ధికి రూ.4785 కోట్లు

- తొలిదశలో తొమ్మిది జోన్ల అభివృద్ధి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రాజధాని పరిధిలో లేఅవుట్ల అభివృద్ధికి రూ.4785 కోట్లు వెచ్చించాలని సిఆర్‌డిఎ నిర్ణయించింది. దీనికోసం ప్రణాళిక రూపొందించింది. ఇప్పటి వరకూ అమరావతిలో 1 నుండి 12, 12ఎ వరకూ జోన్లను రూపొందించారు. ఇవి కాకుండా ప్రపంచబ్యాంకు నిధులతో చేపట్టే పనుల్లో ప్రధాన జోన్లను సబ్‌జోన్లుగా విభజించారు. వాటిల్లో లేఅవుట్ల అభివృద్ధి, విద్యుత్, తాగునీరు ఇతర సదుపాయాలు కల్పించేందుకు వేర్వేరుగా ప్లాను రూపొందించారు. ఈ పనులు చేపట్టేందుకు జనవరిలోపు టెండర్లు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఎల్‌పిఎస్ జోన్ 1ఎలో 448 కోట్లు, 1బిలో 588 కోట్లు వెచ్చించనున్నారు. అలాగే 2ఎ, 2బిలో కలిపి రూ.1084 కోట్లు పెట్టి సదుపాయాలు కల్పించనున్నారు. వీటితోపాటు 6లో 530.83 కోట్లు, 5బి, 5డిలో 1206 కోట్లతో సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. 3ఎలో 505 కోట్లు, 3బిలో 420 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ పనులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించారు. అమరావతి అభివృద్ధిలో కరకట్ట విస్తరణ తరువాత అత్యంత కీలకమైన ఎల్‌పిఎస్‌కు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. లేఅవుట్లను అభివృద్ధి చేసి ఇవ్వడం ద్వారా భూవిక్రయాలు పెరగడంతోపాటు, నిర్మాణ రంగం పుంజుకుంటుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. గతంలోలా జాప్యం జరగకుండా ఉండటం కోసం ఒకవైపు ఆర్థికపరమైన ప్రాజెక్టుల పనులు కొనసాగిస్తూనే రైతులకూ ఆర్థిక అవసరాలు తీర్చే విధంగా లేఅవుట్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించి సమాంతర అభివృద్ధి చేయనున్నారు. దీనివల్ల భూమి విలువ పెరుగుతుందని లెక్కలేశారు. రాజధానిలో మొత్తం 26 లేఅవుట్లు వేశారు. వీటిని 13 జోన్లుగా విభజించారు. ఆ జోన్లను కూడా విభజించి ఇప్పుడు సదుపాయాలు కల్పించనున్నారు. ప్రస్తుతం అభివృద్ధి చేయాలనుకున్న జోన్లన్నీ ప్రభుత్వ కాంప్లెక్స్ ఏరియాతోపాటు మీడియా సిటీ పరిధిలోకి వస్తున్నాయి. మాస్టర్ ప్లాను ప్రకారం ఒకటోజోన్ అనంతవరం పరిధిలోకి వస్తుంది. అక్కడ నుండి ప్రారంభించి ప్రతిపాదిత అభివృద్ధి జోన్లన్నీ కూడా అమరావతి గవర్నమెంటు కాంప్లె(ఎజిసి)కి అటూఇటుగా ఉన్నాయి. అదే ప్రాంతంలో ఉద్యోగులు, ఉన్నతాధికారులు, జడ్జిల నివాసాలూ ఉన్నాయి. వీటన్నిటినీ ఒకేసారి అభివృద్ధి చేయడంతోపాటు ప్రభుత్వ భవనాల పనులూ ప్రారంభించడం ద్వారా సమగ్ర రూపం తీసుకురావాలని నిర్ణయించారు.

'పీసా' ఎన్నికల్లో పోరాడే వారిని ఎన్నుకోవాలి

- ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి- అరకులోయ రూరల్ (అల్లూరి జిల్లా)

ఆదివాసీల హక్కులు, చట్టాల అమలు కోసం పోరాడే అభ్యర్థులను పీసా కమిటీల్లో ఎన్నుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు లోతా రాంబాబు, కిల్లో సురేంద్ర పిలుపునిచ్చారు. అల్లూరి జిల్లా అరకు లోయలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంతమైన పాడేరు, రంపచోడవరం, ఏలూరు ఏజెన్సీ, మన్యం పార్వతీపురం జిల్లాల్లో పీసా కమిటీ ఎన్నికలు జరపాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. అటవీ సంరక్షణ చట్టాన్ని సవరించి షెడ్యూల్ ప్రాంతంలో గ్రామ సభల హక్కులను హరించి ఆదివాసీలను అడవి నుంచి దూరం చేయాలని బిజెపి ప్రయత్నాలు చేస్తోందని, దాన్ని తిప్పి కొట్టాలంటే పీసా కమిటీ అభ్యర్థులుగా పోరాడేవారిని ఎన్నుకోవాలని కోరారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా జిఒ 3 అమలు, గిరిజన స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలపై మాట్లాడే పరిస్థితి లేదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని పీసా గ్రామ సభలను ఉల్లంఘించి గత వైసిపి ప్రభుత్వం చేసుకున్న హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందాలను నేటి టిడిపి కూటమి ప్రభుత్వం కూడా అమలు చేస్తుందని విమర్శించారు. 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టాలను ఏజెన్సీ ప్రాంతంలో అమలు చేయకుండా గిరిజనేతరులకు వందలాది ఎకరాల భూములను దారాదత్తం చేస్తున్నారని, దీంతో పెద్దపెద్ద లాడ్జీలు, రిసార్ట్‌లు బినామీ పేర్లతో నిర్మాణమవుతున్నాయని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులకు భూములు, అడవులు పొందే అధికారం లేదని సుప్రీం కోర్టు తీర్పు చెప్పిందన్నారు. ఆదివాసీల హక్కులు రక్షించుకోవాలంటే పీసా కమిటీ ఎన్నికల్లో పోరాడే అభ్యర్థులను ఎన్నుకోవాలని కోరారు.

కష్టజీవుల రాజ్యమే లక్ష్యం : కె.రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికారంతో నిమిత్తం లేకుండా కష్టజీవుల రాజ్యం స్థాపనే లక్ష్యంగా ఎన్నేళ్లైనా పోరాటం చేస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. సిపిఐ శతవార్షికోత్సవాల సందర్భంగా లెనిన్ పార్కువద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... 1925లో డిసెంబరు 26న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో దేశంలోని మేధావులు, విద్యావంతులు పార్టీని స్థాపించినట్లు చెప్పారు. కమ్యూనిస్టు పార్టీని మొగ్గలోనే తుంచేయాలనే కుట్రతో బ్రిటీష్ వాళ్లు అక్రమ కేసులు బనాయించారని, నాటి నుంచి నేటి వరకూ కుట్రలు, ఇబ్బందులు ఎదుర్కొంటూ పోరాటాలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు పార్టీ కార్యాలయం దాసరి భవన్‌లో అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. రెడ్ షర్ట్ వాలంటీర్ల గౌరవ వందనం స్వీకరించారు. ర్యాలీగా పోలీసు కంట్రోల్ రూం వద్దకు చేరుకుని అక్కడున్న చంద్ర రాజేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి, సిపిఐ శత వార్షికోత్సవాలను ప్రారంభించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వందేళ్లవుతున్న సందర్భంగా వంద మీటర్ల ఎర్రజెండాతో తుమ్మలపల్లి కళా క్షేత్రం నుంచి లెనిన్ పార్కు వరకూ ర్యాలీ నిర్వహిచారు. ఈ కార్యక్రమాల్లో సిపిఐ కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, సిహెచ్ కోటేశ్వరరావు, దోనేపూడి శంకర్, వై.చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డికి మాతృ వియోగం

- ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తల్లి అలుగుబెల్లి భాగ్యమ్మ గురువారం తెల్లవారుజామున నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం చర్లగూడెంలోని ఆమె నివాసంలో మృతి చెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. భాగ్యమ్మకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పెద్దకుమారుడు. ఆమె భౌతిక కాయానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఎస్ వీరయ్య, డిజి నర్సింహారావు, టిఎస్‌యుటిఎఫ్ అధ్యక్షులు జంగయ్య, ఉపాధ్యక్షులు సిహెచ్ రాములు, కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, నాగమణి, విఒటిటి సంపాదకులు మాణిక్‌రెడ్డి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. వీరి వెంట సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు బొంతల చంద్రారెడ్డి, టిఎస్‌యుటిఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సైదులు ఉన్నారు. చర్లగూడెంలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

మిట్టల్‌పై ఉన్న ప్రేమ 'విశాఖ' పై లేదేం?

- ముఖ్యమంత్రి వైఖరిపై సిపిఎం నిరసన



విశాఖ జగదాంబ జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలని ప్రధాని మోడీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన విశాఖ జగదాంబ జంక్షన్‌లో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ.. ప్రధాని మోడీతో పాటు ఆర్థిక, స్టీల్, రైల్వే మంత్రులను చంద్రబాబునాయుడు కలిసి రాష్ట్రాభివృద్ధికి సంబంధించి అనేక ప్రాజెక్టులు, సమస్యలు, నిధులపై చర్చించారని, ఈ చర్చల్లో ప్రధానితో ప్రత్యేకంగా మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు తక్షణం ముడి ఇనుప గనులు కేటాయించాలని, అన్ని అనుమతులూ మంజూరు చేయాలని కోరారని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్య పరిష్కారంపై మాట్లాడకపోవడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు దాటినా నేటికీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ముడి ఇనుప గనుల కేటాయింపు, సెయిల్‌లో విలీనం, రూ.18 వేల కోట్లు ప్యాకేజీ సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్యను పరిష్కరించకుండా మిట్టల్ ప్లాంట్‌కు దాసోహమవటం సిగ్గుచేటు అని అన్నారు. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భూమి కేటాయింపు, జిఎస్‌టి మినహాయింపు, విద్యుత్ రాయితీ, పెట్టుబడి సాయం, భూ బదలాయింపు, ఫీజుల మినహాయింపు, మంచినీరు, రోడ్లు, రైల్వే లైన్లు తదితర సదుపాయాలన్నీ కల్పించడానికి సిద్ధమైందని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎటువంటి పన్నులూ, విద్యుత్ రాయితీలూ కల్పించకుండా, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని ఆరునెలలైనా నెరవేర్చకపోవటం వెనుక విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధి అర్థమవుతోందన్నారు. ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిని దెబ్బతీయటానికి ప్రయత్నిస్తోందని, కార్మికులకు వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని, ఫైర్ సేఫ్టీ సర్వీస్ విభాగంతో పాటు అనేక విభాగాలను ప్రయివేట్‌పరం చేసే చర్యలకు తెగబడుతోందని విమర్శించారు. ఈ చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు.


విశాఖ స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ భవనం వద్ద ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న అయోధ్యరామ్

కార్మికులకు తక్షణం వేతనాలు చెల్లించాలి

- ఉక్కు పరిపాలన భవనం ఎదుట ధర్నా

ప్రజాశక్తి -ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు తక్షణం వేతనం చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యాన ఉక్కు ప్రధాన పరిపాలనా భవనం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ ప్రధాని మోడీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి భూసేకరణ చేయని ప్రయివేట్ స్టీల్‌ప్లాంట్‌కు ముడి ఖనిజం కావాలని ప్రశ్నించడం హాస్యాస్పదమని తీవ్రంగా విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడతామని ప్రకటనలతోనే కాలం గడుపుతున్నారని, ఆచరణలో ఒక్క అడుగైనా ముందుకు పడలేదని పేర్కొన్నారు. గత నెల ఇచ్చిన టార్గెట్ మేరకు కార్మికులు కష్టించి ఉత్పత్తిని సాధించారని, ఈ నెల కూడా అది సాధిస్తున్న కార్మికులను పస్తులుపెట్టి జిఎస్‌టి రూపంలో రూ.380 కోట్లను ప్రభుత్వం ముక్కు పిండి తీసుకుంటోందని తెలిపారు. కార్మికుల వేతనాలే పెట్టుబడిగా ప్రభుత్వం, యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయని, తక్షణం కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు వైటి దాస్ మాట్లాడుతూ ప్రభుత్వ యాజమాన్యాల వైఖరిని ప్రశ్నించాల్సిన స్థానిక ప్రజా ప్రతినిధులు మౌనం వహించడం కార్మికుల దౌర్భాగ్యమని, ప్రజా ప్రతినిధులు మౌనం వీడి కార్మికులను రక్షించాలని డిమాండ్ చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు రామస్వామి మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ దగ్గర ఉన్న భూములను స్టీల్‌ప్లాంట్‌కు బదలాయిస్తే తన సొంత కాళ్లపై నిలబడి లాభాలు ఆర్జిస్తుందని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడటమంటే సెయిల్‌లో విలీనం చేసి, సొంత గనులను కేటాయించడమే సరైన మార్గమని, ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించి తగిన నిర్ణయాన్ని తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి శ్రీనివాసరాజు, బి అప్పారావు, టివికె రాజు, డిఎస్ఆర్‌సి మూర్తి, మరిడయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరామచంద్రమూర్తి, ఎంఎస్ రాజు, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

త్యాగాలు, పోరాటాలకు సిద్ధం కండి

- సిపిఐ శత వార్షికోత్సవ సభలో రామకృష్ణ పిలుపు



గుంటూరులో భారీ ప్రదర్శన నిర్వహిస్తున్న సిపిఐ నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి-గుంటూరు

భారతదేశ రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి, లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, సమసమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ త్యాగాలు, పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. గుంటూరులో గురువారం జరిగిన సిపిఐ శతవార్షికోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత బిఆర్ స్టేడియం నుండి గాంధీ పార్క్ వరకు ప్రదర్శన నిర్వహించారు. నగర కార్యదర్శి కె.మల్యాద్రి అధ్యక్షతన జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి స్వాతంత్ర్య సమరయోధులు అంటే గౌరవం లేదని, రాజ్యాంగం పట్ల విశ్వాసం లేదని విమర్శించారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను సైతం అవమానిస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ దేశ సంపదను అంబాని, అదానిలకు దోచిపెడుతోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో దేశంలో సోషలిస్టు సమసమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు సమాయత్తం కావాల్సిన అవసరముందని పేర్కొన్నారు. కమ్యూనిస్టు నాయకులపై కుట్రలు పన్ని జైలుకు పంపినా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగి దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని గొంతెత్తిన పార్టీ సిపిఐ అని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం భూ పోరాటాలు పెద్ద ఎత్తున చేపట్టినట్లు చెప్పారు. నాటి పోరాటం, త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని తెలిపారు. సభలో పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి తదితరులు ప్రసంగించారు.

అల్ట్రాటెక్ చేతికి ఐసిఎల్

- జువారీపై కన్నేసిన అదాని గ్రూప్

ప్రజాశక్తి- ఎర్రగుంట్ల (కడప జిల్లా)



ఐసిఎల్ వద్ద వెలసిన అల్ట్రాటెక్ బోర్డు

ఇండియా సిమెంట్స్ (ఐసిఎల్) పరిశ్రమలను 55.49 శాతం వాటాతో ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్ యాజమాన్యం చేజిక్కించు కుంది. వైఎస్ఆర్ జిల్లాలోని ఎర్రగుంట్ల, చిలమకూరు, మిగతా విష్ణుపురం, మల్కాపూర్, దాల్వాయి, శంకరి, శంకర్ నగర్, బన్వారాలలో ఉన్న సిమెంట్ పరిశ్రమలతో పాటు చెన్నైలో ఉన్న గ్రైండింగ్ యూనిట్‌ను అల్ట్రాటెక్ చేజిక్కించుకుంది. యాజమాన్యం మార్పుతో ఉన్నతాధికారుల మార్పు జరగబోతున్నట్లు సమాచారం. గురువారం ఎక్కడికక్కడ పరిశ్రమలలోని సిబ్బందితో సమావేశాలు నిర్వహించారు. యాజమాన్యం మార్పు వలన జీతాలు పెరగవచ్చని చిరుద్యోగులు ఆశిస్తున్నారు. పాత బోర్డులను తొలగించి అల్ట్రాటెక్‌కు చెందిన కొత్త బోర్డులను ఎక్కడికక్కడ ఏర్పాటు చేస్తున్నారు. వైఎస్ఆర్ జిల్లాలోని జువారి పరిశ్రమను అదాని సంస్థ చేజిక్కించుకోవాలని చూస్తోందని స్థానికులలో చర్చ జరుగుతోంది.

ఆటో నుంచి జారిపడి విద్యార్థి మృతి

ప్రజాశక్తి-చీపురుపల్లి (విజయనగరం జిల్లా)


భార్గవసాయి (ఫైల్ ఫోటో)

ఆటో నుంచి జారిపడి విద్యార్థి మృతి చెందిన ఘటన విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం మెట్టపల్లి సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన కథనం ప్రకారం.. చీపురుపల్లి మండలం మెట్టపల్లి గ్రామానికి చెందిన గురాన ఈశ్వరరావు, గౌరి దంపతుల కుమారుడు భార్గవసాయి (10) చీపురుపల్లిలోని ప్రయివేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. భార్గవసాయి మెట్టపల్లి నుంచి పాఠశాలకు ఆటోలో గురువారం ఉదయం బయలుదేరారు. మెట్టపల్లి, అలజంగి మధ్య మలుపు వద్ద ప్రమాదవశాత్తూ ఆటో నుంచి విద్యార్థి జారిపడ్డాడు. అదే ఆటో చక్రం బాలుడి తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి సిహెచ్‌సికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ రమణ తెలిపారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయండి

- ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు




ప్రచారయాత్రను ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - మెళియాపుట్టి (శ్రీకాకుళం)

ప్రభుత్వ విద్యా రంగాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడమే ప్రధాన అజెండాగా జనవరి ఐదు నుంచి ఎనిమిదో తేదీ వరకు కాకినాడలో నిర్వహించే యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ నెల 31 వరకు చేపట్టే మహాసభ ప్రచార యాత్రను శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టిలో ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. పాలకవర్గాల నిర్బంధాలు, కేసులు, అవరోధాలను అధిగమించి ఉపాధ్యాయులను పోరుబాట పట్టించి సమస్యల పరిష్కారంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవడం, రాజ్యాంగ లక్ష్యాలు, విలువలను కాపాడుకోవడం ఉపాధ్యాయుల ప్రధాన కర్తవ్యంగా ఉండాలని కోరారు. విద్యారంగం ప్రయివేటీకరణ కాకుండా ప్రతిఘటించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ జనవరి 5న సిఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రాష్ట్ర మహాసభ ప్రారంభం కాబోతున్నాయన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్‌తోపాటు పలు రాష్ట్రాలకు చెందిన విద్యారంగ ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్, ఆర్.మోహనరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రూ'పాయే'

డాలర్@85.27



ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ వరుస పతనం కొనసాగుతోంది. గురువారం అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ 12 పైసలు క్షీణించి 85.27 కనిష్ట స్థాయికి దిగజారి.. భారత కరెన్సీ చరిత్రలోనే అత్యంత కనిష్టానికి పడిపోవడం గమనార్హం. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో రూపాయి విలువ 85.23 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 85.28 కనిష్ట స్థాయిని తాకి.. తుదకు 85.27 స్థాయిలో ముగిసింది. డిసెంబర్ నెల చివరి రోజులు కావడంతో ఫారెక్స్ ట్రేడర్లు తమ చెల్లింపుల డిమాండ్‌ను చేరుకోవడానికి డాలర్ల కొనుగోళ్లకు ఎగబడుతున్నారు. ఇప్పటికే డాలర్‌కు పెరిగిన డిమాండ్‌ను మరింత పెంచుతోంది. మరోవైపు దేశ ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకుంటున్న అత్యంత బలహీనమైన గణంకాలు, స్టాక్ మార్కెట్ల వరుస పతనం, విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడం, పేలవ ఎగుమతుల తీరు, దిగుమతులు పెరగడం తదితర అంశాలు రూపాయి విలువను బక్కచిక్కేలా చేస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు. డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడంతో ఇప్పటికే వాహన కంపెనీలు ధరలు పెంచడాన్ని ప్రారంభించాయి. ఇదే బాటలో ఎలక్ట్రానిక్స్, చమురు, బంగారం, ఇతర దిగుమతి ఉత్పత్తులు భారం కానున్నాయి.

బాలుడికి 'జికా వైరస్' నెగెటివ్

- ప్రజలు ఆందోళన చెందొద్దు: డిఎంఅండ్‌హెచ్‌ఒ

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం, వెంకటరామాపురం గ్రామానికి చెందిన బాలుడు సుబ్బరాయుడుకు జికా వైరస్ నెగెటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఈ విషయాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి సుజాత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాలుడు రక్తనమునాలను పూణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ల్యాబ్‌కు పంపారు. పరీక్షించిన వైద్యులు నెగెటివ్‌గా నిర్ధారించారు. 'ఈ నెల 14న జ్వరంతో బాధపడుతూ నెల్లూరులోని నారాయణ వైద్యశాలలో సుబ్బరాయుడు చేరారు. బాలుడి శాంపిల్స్‌ను ముంబైలోని 'ఓజిలస్ ల్యాబ్' కు పంపగా జికా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారిస్తూ 16న రిపోర్టు అందజేశారు. మెరుగైన చికిత్స కోసం చెన్నైలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చైల్డ్ హెల్త్ ఆస్పత్రిలో బాలుడిని చేర్చారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్, చెన్నై వారి ఆధ్వర్యంలోని స్టేట్ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీ వారు 19న బాలుడు, వారి తల్లిదండ్రుల శాంపిల్స్‌ను పరీక్షించగా నెగెటివ్‌గా నిర్ధారణ అయ్యింది. పూణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ల్యాబ్ వారు కూడా నెగెటివ్‌గా నిర్ధారించారు. ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదు' అని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి పేర్కొన్నారు.

పలాసలో జల్‌జీవన్ బృందం పర్యటన

ప్రజాశక్తి - పలాస (శ్రీకాకుళం జిల్లా)


మంచినీటి కుళాయిని పరిశీలిస్తున్న జల్ జీవన్ మిషన్ బృందం సభ్యులు

జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యమని జాతీయ జల్ జీవన్ మిషన్ బృందం సభ్యులు సౌమిత్రాసేను గుప్తా, సౌమింద్రా రంజన్ గంగూలీ, సమీర్ పండా అన్నారు. శ్రీకాకుళం జిల్లా పలాస మండలం రామకృష్ణాపురంలో రూ.30 లక్షలు, రామకృష్ణా పురం కాలనీలో రూ.3.16 కోట్ల వ్యయంతో జల్ జీవన్ మిషన్ కింద నిర్మించిన మంచినీటి పథకాలను జాతీయ జల్ జీవన్ మిషన్ బృందం గురువారం పరిశీలించింది. రామకృష్ణాపురం కాలనీలో 2,560 కుళాయిలు, 25 కిలో మీటర్ల మేర పైపులైన్లు, రెండు లక్షల లీటర్ల సామర్థ్యం గల సంపు, రామకృష్ణాపురంలో 107 కుళాయిలు, పైపులైన్ల నిర్మాణ పనులను పరిశీలించినట్లు బృందం సభ్యులు తెలిపారు. ప్రతి ఇంటికి తాగు నీరు అందిస్తామని చెప్పారు. వారి వెంట ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సూర్యనారాయణ, ఎఇలు ధనుంజయ, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లలో ఒడిదుడుకులు..

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. ఉదయం పుంజుకున్న సూచీలు మధ్యాహ్నం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 0.39 పాయింట్ల నష్టంతో 78,472 వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 78,898 - 78,173 పాయింట్ల మధ్య కదలాడింది. మరోవైపు, ఎన్ఎస్ఇ-50 సూచీ నిఫ్టీ 22.55 పాయింట్ల నష్టంతో 23,570.20 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ50 స్టాక్స్‌ల్లో 31 స్టాక్స్ సానుకూలంగా ట్రేడింగ్ అయ్యాయి.

బీమాకు తగ్గుతున్న డిమాండ్

న్యూఢిల్లీ : దేశంలో హెచ్చు ధరలు, ద్రవ్యోల్బణం బీమా రంగం డిమాండ్‌ను దెబ్బతీస్తున్నాయి. కొత్త పాలసీల అమ్మకాలు తగ్గాయని ఐఆర్‌డిఎఐ 2023-24 వార్షిక నివేదిక తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం 2023-24 జిడిపిలో బీమా ప్రీమియంల నిష్పత్తి 3.7 శాతానికి పరిమితమయ్యింది. అంతకు ముందు 2022-23లో ఇది 4 శాతంగా ఉంది. 2021-22లో ఏకంగా 4.2 శాతంగా చోటు చేసుకుంది. దీంతో పోల్చితే తర్వాత రెండేళ్లలో బీమా పాలసీల అమ్మకాలు పడిపోతున్నాయని స్పష్టం అవుతోంది.

భారీగా తగ్గుతున్న పెట్టుబడి వ్యయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అభివృద్ధికి అత్యంత కీలకమైన సంపద సృష్టిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. పెట్టుబడి వ్యయం కింద ఎనిమిది నెలల్లో కేవలం ఏడు వేల కోట్ల వరకు మాత్రమే ఖర్చు చేసినట్లు తేలింది. అంటే నెలకు వెయ్యి కోట్లు కూడా లేదు. గత ఏడాది తొలి ఎనిమిది నెలల్లో రు. 17 వేల కోట్లకుపైగా వ్యయం చేయడం గమనార్హం. ఈ ఏడాది ఒక్క అక్టోబర్ నెలలోనే 3,105 కోట్లు ఖర్చు చేయగా, ఆగస్టులో 1,314 కోట్లు ఖర్చు చేశారు. ఇక మిగిలిన అన్ని నెలల్లో నామమాత్రంగానే ఖర్చు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. అత్యల్పంగా మే నెల్లో 228 కోట్లు, జూన్‌లో 465 కోట్లు ఖర్చు చేశారు. గత ఏడాది తొలి నాలుగు నెలలూ రెండు వేలకోట్లకుపైగానే ఖర్చు చేయగా, ఒక్క ఏప్రిల్‌లోనే 5,532 కోట్లు ఖర్చు చేశారు.

కీలక శాఖల్లో ఖర్చు కరువు

రాష్ట్రాభివృద్ధికి కీలకమైన శాఖల్లో నామమాత్రము ఖర్చు కనిపిస్తోంది. విద్యాశాఖలో గతేడాది 481 కోట్లు ఖర్చు చేయగా, ఈ ఏడాది 239 కోట్లే ఖర్చు చేసేందుకు నిర్ణయించారు. తాగునీటికి సంబంధించి గత ఏడాది 390 కోట్లు పెట్టుబడి వ్యయంగా ఖర్చు చేయగా, ఈ ఏడాది 155 కోట్లకే పరిమితం కానున్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో కూడా గత ఏడాది కన్నా ఈ ఏడాదితక్కువ మొత్తమే పెట్టుబడి వ్యయంగా ఖర్చు చేయనున్నారు. మరో కీలక రంగమైన గ్రామీణాభివృద్ధిలో కూడా పెట్టుబడి వ్యయం అంతంతమాత్రంగానే కనిపిస్తోంది. గత ఏడాది 784 కోట్లు ఖర్చు చేయగా, ఈ ఏడాది కేవలం 195 కోట్లే ఖర్చు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

నవంబర్ వరకు పెట్టుబడి వ్యయం వివరాలు (రూ. కోట్లలో)

నెల	గతేడాది	ఈ ఏడాది
ఏప్రిల్	5,533	723
మే	3584	228
జూన్	3378	465
జూలై	2122	509
ఆగస్టు	982	1315
సెప్టెంబర్	635	937
అక్టోబర్	367	3106
నవంబర్	1021	480
మొత్తం	**17,622**	**7,763**

అంతర్జాతీయ సరఫరాలపై 50 శాతం డిస్కౌంట్

డిహెచ్‌ఎల్ ఎక్స్‌ప్రెస్ వెల్లడి

ముంబయి : లాజిస్టిక్, కొరియర్ రంగంలోని డిహెచ్‌ఎల్ ఎక్స్‌ప్రెస్ ప్రత్యేకమైన పండుగ సీజన్ డిస్కౌంట్లను అందిస్తోన్నట్లు పేర్కొంది. అన్ని అంతర్జాతీయ సరఫరాలపై 50 శాతం వరకు, దేశీయంగా ఉత్పత్తుల రవాణాపై 40 శాతం వరకు తగ్గింపును ఇవ్వనున్నట్లు తెలిపింది. డిహెచ్‌ఎల్ రిటైల్ అవుట్ లెట్‌ల వద్దకు నేరుగా లేదా ఆన్ లైన్‌లో తమ షిప్ మెంట్‌లను బుక్ చేసే కస్టమర్‌లకు ఈ ఆఫర్లు 2015 జనవరి 15 వరకు అందుబాటులో ఉంటాయని డిహెచ్‌ఎల్ ఎక్స్‌ప్రెస్ ఇండియా ప్రతినిధి సందీప్ జునేజా తెలిపారు.

మార్చిలోగా నిర్మాణాలు.. లేదంటే ఇళ్ల రద్దు

- నేటికీ ప్రారంభం కాని 3 లక్షల గృహాల పనులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో


జగనన్న కాలనీల పేరుతో గత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా, నేటికీ మూడు లక్షల ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభమే కాలేదు. 2025 మార్చిలోగా లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులను చేపట్టని పక్షంలో ఇంటి మంజూరు (హౌస్ శాంక్షన్) పత్రాన్ని రద్దు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఎక్కువమంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టని జిల్లాల్లో ఎన్‌టిఆర్, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విశాఖపట్నం ఉన్నాయి.

ఈ జిల్లాల్లో సుమారు 70వేలకు పైగా నిర్మాణాలు ప్రారంభం కాలేదు. మిగిలిన జిల్లాల్లో 2.30 లక్షలకుపైగా ఇళ్ల నిర్మాణం పనులు ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదు. ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.50లక్షలు ఇవ్వడంతోపాటు మరో రూ.35 వేలు పావలా వడ్డీకి బ్యాంకుల నుంచి రుణం అందజేస్తోంది. ప్రభుత్వం మంజూరు చేసే నిధులు పునాదులకు కూడా సరిపోవడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు కేటాయించిన స్థలం వద్దకు వెళ్లేందుకు రహదారి లేకపోవడం, సురక్షితమైన తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల కల్పన లేకపోవడంతో ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. పట్టణాలకు దూరంగా ఉండటం, రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల తాము పనులు చేసుకునేందుకు పట్టణాలకు వెళ్లిరావడం ఇబ్బందిగా ఉందని లబ్ధిదారులు చెబుతున్నారు. చిన్న ఇల్లు కట్టాలన్నా రూ.5 లక్షలుపైనే ఖర్చవుతుందని, పెరిగిన ధరలకు అనుగుణంగా యూనిట్ ధరను పెంచకపోతే ఇల్లు కట్టుకోవడం సాధ్యమయ్యే పరిస్థితి లేదని వారు చెబుతున్నారు. ప్రభుత్వం యూనిట్ ధరను పెంచాలని ఇళ్లు మంజూరైనా నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నవ వధువు ఆత్మహత్య

- పరారీలో అత్త
- భర్త, మామ అరెస్ట్

ప్రజాశక్తి- సింగరాయకొండ (ప్రకాశం జిల్లా)


అమూల్య (ఫైల్)

అత్తారింట వేధింపులు తాళలేక నవ వధువు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం, శానంపూడి గ్రామంలో గురువారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన తగరం అమూల్య (19)కు సింగరాయకొండ మండలం, శానంపూడి గ్రామానికి చెందిన తగరం గోపికృష్ణతో నవంబర్ 17న వివాహమైంది. ఓ రొయ్యల ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా గోపికష్ణ పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి డ్యూటీ నుంచి వచ్చే సరికి ఇంటిలోని ఫ్యాన్‌కు విగతజీవిగా వేలాడుతూ అమూల్య కనిపించింది. కుమార్తె మృతి వార్త తెలుసుకున్న తల్లిదండ్రులు హైదరాబాద్ నుంచి గురువారం ఉదయం శానంపూడికి వచ్చారు. అత్త ఆదిలక్ష్మి వేధింపుల వల్లే తమ కుమార్తె మృతి చెందారని అమూల్య తండ్రి పాలపర్తి చిరంజీవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నవంబర్ 17న వివాహం జరగగా డిసెంబర్ 25కు విగతజీవిగా ఉన్న కూతుర్ని చూసి తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. అత్త ఆదిలక్ష్మి పరారీలో ఉండగా.. అమూల్య భర్త గోపికృష్ణ, మామ కృపానందంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కందుకూరు ఆస్పత్రికి పోలీసులు తరలించారు.

సంపాదకీయం

కనీస 'మద్దతు' అవసరం

మాటల్లో ఊరేగించి, చేతల్లో ఉరి బిగించే మోసకారి విధానాలతో అన్నదాతల ఉసురు పోసుకోవటం పాలకులకు పరిపాటిగా మారింది. రైతు దేశానికి వెన్నెముక అంటూ ఉపన్యాసాలు ఊదరగొట్టే ప్రభుత్వాలు ఆ వెన్నెముకను కర్కశంగా విరిచేసే చేతలకు తెగిస్తున్నాయి. చేసిన శ్రమకు, ఉత్పత్తికి కనీసంలో కనీసంగా ఖరీదు కట్టటం అనేది ఒక సాధారణ న్యాయం. కానీ, ఈ సాధారణ న్యాయం దశాబ్దాల తరబడి రైతులకు అందటం లేదు. పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలన్న అంశానికి చట్టబద్ధత కల్పించటం ఇంకా ఎండమావిగానే ఉంది. కేంద్రంలోని బిజెపి తాను అమలు చేస్తామని అనేకసార్లు వల్లించిన కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి తదితర 11 డిమాండ్లతో ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల ఆందోళన కొనసాగుతోంది. రైతు నాయకుడు జగ్జిత్‌సింగ్ దల్లేవాల్ నవంబరు 26వ తేదీన నిరాహార దీక్ష చేపట్టి నెలరోజులు గడిచిపోయినా కేంద్రప్రభుత్వ పెద్దల్లో కనీస చలనం లేకపోవటం శోచనీయం.

ఎండనక వాననక ఆరుగాలం చెమటోడ్చి కష్టించే అన్నదాతలకు ప్రకృతి వైపరీత్యాలతో ఎదురయ్యే సమస్యలు అన్నీ ఇన్నీ కావు. వాటికి అదనంగా దళారుల మోసాలు, మార్కెట్ ధర పతనాలు, రవాణా భారాలూ చేరి, కష్టాలూ కన్నీళ్లే దిగుబడులుగా వ్యవసాయాన్ని వ్యయభరితంగా మార్చేశాయి. ఈ దుర్భర స్థితి నుంచి రైతును రక్షించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ కష్టాలను మరింత పెంచుతున్నాయి తప్ప, భరోసాగా నిలవటం లేదు. దరిమిలా దేశంలో గత మూడు దశాబ్దాల్లో నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఇటీవల సుప్రీంకోర్టు తనకందిన అధికారిక నివేదిక నుంచి పేర్కొంది. నివేదికలకెక్కని చావులను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఈ ఆత్మహత్యల లెక్క ఏడు లక్షలకు పైబడే ఉంటుందని పరిశీలకుల అంచనా. వ్యవసాయమొక ప్రధాన జీవన రంగంగా సాగుతున్న దేశంలో రైతుల పరిస్థితి ఇంత దుర్భరంగా ఉండడం చాలా బాధాకరం. కేంద్ర ప్రభుత్వం రైతుల కష్టాలను తీర్చకపోగా ఎరువుల ధరలను పెంచి, సహకార వ్యవస్థలను, మార్కెట్టు యార్డులను నిర్వీర్యపర్చి మరిన్ని ఇక్కట్లను జోడించింది.

వ్యవసాయరంగం సంక్షోభం నుంచి బయటపడటానికి గతంలో స్వామినాథన్ కమిషన్ కొన్ని సిఫార్సులు చేసింది. పంటలకు మద్దతు ధర (సి2 + 50 శాతం)ను ఇవ్వాలని, సింగిల్ యూనిట్ ప్రాతిపదికన పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని, రైతులందరికీ బ్యాంకు రుణాలు ఇవ్వాలని, మార్కెట్ సదుపాయాలు పెంచాలని సూచనలు చేసింది. దశాబ్దం క్రితం వరకూ అధికారంలోకి రాక ముందు బిజెపి బలంగా వినిపించిన ఎన్నికల వాగ్దానాల్లో ఇవన్నీ ఉన్నాయి. గద్దెనెక్కాక ఆ హామీలను ఆవలకు విసిరేసి, రైతులకు పంగనామాలు పెట్టే పనికి సమాయత్తమైంది! ఉన్న రాయితీలను తీసేసి, మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి, కార్పొరేట్లకు లాభాలు చేకూర్చే దుస్సాహసానికి ఒడిగట్టింది. వాటిని వెనక్కి కొట్టటానికి లక్షలాదిమంది రైతులు నెలల తరబడి, ఢిల్లీ సరిహద్దుల్లో చారిత్రాత్మక పోరాటం చేశారు. తప్పని పరిస్థితుల్లో మోడీ క్షమాపణలు చెప్పి, ఆ చట్టాలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించినప్పటికీ, ఆ తరువాత ఈ మూడేళ్లలో రైతులను ఉద్ధరించే చర్య ఒక్కటంటే ఒక్కటీ చేపట్టలేదు. ఏడాదికి మూడు విడతలుగా విదిల్చే రూ.6 వేల సహాయాన్నే గొప్ప ఉపకారంగా మోడీ పరివారం చెప్పుకుంటోంది.

ఇలాంటి అరకొర విదిలింపులతో దేశ వ్యవసాయ రంగానికి ఒరిగేది ఏమీ ఉండదు. రైతు సమస్యలపై అధ్యయనం చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇటీవల విడుదల నివేదిక కూడా దీనినే స్పష్టం చేస్తోంది. కనీస మద్దతు ధరకు గ్యారంటీ, రుణమాఫీ, పిఎం కిసాన్ నిధుల రెట్టింపు, బడ్జెట్లో వ్యవసాయరంగ వాటా పెంపు వంటి ప్రతిపాదనలు చేసింది. మోడీ ప్రభుత్వం తాను చెప్పుకుంటున్నట్టు రైతులకు ఇప్పటికే చాలా మేళ్లు చేసివుంటే– కొత్తగా ఈ ప్రతిపాదనలు ఎందుకు? రైతాంగం పట్ల కత్తి కట్టినట్టు వ్యవహరించే ధోరణికి బిజెపి ప్రభుత్వం ఇకనైనా స్వస్తి పలకాలి. రైతుల న్యాయమైన డిమాండ్లను తక్షణం నెరవేర్చాలి. భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే ఉదారవాద ఆర్థిక విధానాలను విడనాడాలి. రైతు నిశ్చింతగా ఉండటానికి, వ్యవసాయరంగం నిలబడటానికి ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలి.

మహనీయుల మాట



సామ్రాజ్యవాదం అనేది పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క అత్యంత హింసాయుత దశ. కార్మికులనూ, కర్షకులనూ ప్రపంచ స్థాయిలో దోచుకునే పెట్టుబడిదారీ వ్యవస్థే సామ్రాజ్యవాదం.

- డేవిడ్ ఎస్ పెనా,
అమెరికా లోని మియామీ డేడ్ కాలేజీ లైబ్రరీ డైరెక్టర్, అమెరికా కమ్యూనిస్టు పార్టీ అసోసియేట్.

ప్రపంచ 'పెట్టుబడిదారీ' లాభాపేక్ష మానవాళికి వినాశకరం

విశ్లేషణ




ప్రబీర్ పుర్కాయస్థ

'కాప్' 29 సదస్సు కనీసం కూనిరాగంగా కూడా ముగియ లేదు. 'కాప్' 28 సదస్సు అనంతరం శిలాజ ఇంధనాల శకానికి స్వస్తి పలుకుదామని ప్రకటించారు. వాతావరణ మార్పులు, పేదరికం–జమిలి ప్రమాదాలను ఎదుర్కొంటున్న వర్ధమాన దేశాలకు భూరి సాయం అందిస్తామని వాగ్దానం చేసిన ధనిక దేశాలు ఆ వాగ్దానాల నుండి వెనకడుగు వేశాయి. శిలాజ ఇంధనాల వాడకాన్ని–ముఖ్యంగా చమురు, సహజ వాయువులను క్రమబద్ధంగా ఉపసంహరించుకోవడం గురించి నిర్దిష్టమైన హామీ ఏదీ ప్రకటించకపోగా వర్ధమాన దేశాలకు వాణిజ్య, వాణిజ్యేతర రూపాల్లో 1.3 లక్షల కోట్ల డాలర్ల సాయం అవసరం ఉండగా కేవలం 300 కోట్ల డాలర్ల సాయం అదీ 2033 నాటికి అందిస్తామని ప్రకటించాయి. వర్ధమాన దేశాలకు అవసరమైన 1.3 లక్షల కోట్ల డాలర్ల సాయం అందిస్తామని ఒక 'ప్రవిత్రమైన ఆకాంక్ష'ను వెలిబుచ్చడంతో సరిపెట్టాయి. వాతావరణ మార్పులు, పేదరికం ప్రమాదాలను ఎదుర్కొంటున్న పేద దేశాలకైనా ఒకింత ఆర్థిక సాయం ప్రకటించలేదు.

ధనిక దేశాలు ప్రకటించిన 300 కోట్ల డాలర్ల సాయంలో అప్పులు, వాణిజ్య రుణాలు ఉన్నాయి. అంటే 'హరిత ఆర్థిక వ్యవస్థకు తోడ్పాటు ఇచ్చే పేరిట వర్ధమాన దేశాల మౌలిక సౌకర్యాల వ్యవస్థను ధనిక దేశాలు కబళించేందుకు చూస్తున్నాయి. ఇది నయా వలస దోపిడీ సాగించడానికి వేసిన ఎత్తుగడ తప్ప వేరొకటి కాదు. ధనిక దేశాలు ఇవ్వజూపుతున్న 'సాయం'లో కర్బన మార్కెట్ల వాణిజ్యం కూడా ఒకటి. ఇది సార్వభౌమ దేశాల ప్రజలను మోసగించడం మినహా మరొకటి కాదు. కర్బన మార్కెట్ల వాణిజ్యం ద్వారా ఆ యా దేశాల ఉద్గారాలను తగ్గించడం సాధ్యం కానే కాదు. వాతావరణ మార్పులను అరికట్టే పేరిట ధనిక దేశాలు, వాటి బహుళజాతి సంస్థలు కపట నాటకం ఆడుతున్నాయి.

ఇంధన రంగం ఎదుర్కొంటున్న సవాళ్ళలో ప్రధానమైన విద్యుత్ రంగ పరిణామాల వరకే నేను ఈ వ్యాసంలో పరిమితం అవుతాను. రవాణా రంగంలో మార్కెట్ శక్తులు అత్యంత నాటకీయంగా ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, అమ్మకాల వైపు మొగ్గాయి. వ్యవసాయం, పరిశ్రమల రంగాలలో విద్యుత్ అవసరాలు ఎంత కీలకమో అందరికీ తెలిసినదే. ఇప్పుడు నేనా విషయాల లోతుల్లోకి వెళ్లడం లేదు. 18వ శతాబ్దం మధ్య కాలం నుండి పరిశ్రమలకు, గృహావసరాలకు విద్యుత్ వినియోగం మొదలు కావడంతో వాతావరణంలో కర్బన ఉద్గారాలు పెరగసాగాయి. అలాగే రవాణా రంగంలో కార్లు, బస్సులు, లారీలకు పెట్రోలు, డీజిల్ వినియోగం పెరగడం, రైళ్ల నడిపేందుకు ఆవిరి/బొగ్గు వినియోగం పెరగడంతో భూగోళ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి.



1980వ దశకానికి వచ్చేసరికి వాతావరణ మార్పులకు సంబంధించిన శాస్త్రీయమైన అధ్యయనం, గణాంకాలు అందుబాటులోకి వచ్చాయి. చమురు, సహజ వాయువుల వెలికితీత వ్యాపారంలో ఉన్న బడా కార్పొరేషన్లకు...అవి వాతావరణంలోకి ఏ మేరకు గ్రీన్‌హౌస్ వాయువులకు (కర్బన ఉద్గారాలకు) కారణభూతం అవుతున్నాయో తెలిసికూడా వాటిని అరికట్టే మార్గాల మీద దృష్టి పెట్టలేదు. పైపెచ్చు వాతావరణ మార్పులు అనేవి నిరాధార అంచనాలను ప్రచారం చేసే, కొట్టి పారేసే సంస్థలకు, వ్యక్తులకు నిధులు సమకూర్చి మరీ ప్రచారానికి ఊతం ఇచ్చాయి. మానవ నాగరికతకు వినాశనం దాపురించినా సరే ఈ సంస్థలకు తాము గడించే లాభాలే ముఖ్యం అయిపోయాయి.

శిలాజ ఇంధనాల ప్లాంట్లకన్నా పునరుత్పాదక ఇంధన తయారీ పాంట్ల పెట్టుబడి, నిర్వహణ వ్యయాలు తక్కువ కావడంతో ఒక్కసారిగా పరిస్థితులు తిరగబడ్డాయి. వాస్తవానికి పునరుత్పాదక ఇంధనానికి సూర్యుని వేడిమి, సహజంగా వీచే గాలి ప్రధాన వనరులు కావడంతో ఈ ప్లాంట్ల నిర్వహణకు అయ్యే వ్యయం సున్నా. శిలాజ ఇంధనాల ఉత్పత్తి కేంద్రాల పెట్టుబడి వ్యయాలను కార్పొరేషన్లు ఏనాడో తిరిగి రాబట్టుకున్నాయి. ఈ ప్లాంట్ల నుండి సరఫరా అయ్యే విద్యుత్ కోసం మనం చెల్లిస్తున్న చార్జీలు కేవలం ప్లాంట్ల ఇంధన ఖర్చులే. గాలి వీచని రోజున, సూర్యుడు వెలుగు ఇవ్వని రోజున మనకు ఈ ప్లాంట్లు ఉత్పత్తి చేసే విద్యుత్ అవసరం పడుతుంది. పవన, సౌర విద్యుత్‌లు అందుబాటులో లేని సమయాల్లో పవర్‌గ్రిడ్‌ల నుండి మనకు విద్యుత్ సరఫరా అయ్యేలా చూడడానికి అవసరమైన విద్యుత్ నిల్వ కేంద్రాలను మనం ఇప్పటికీ రూపొందించుకోలేదు. అయినా ఈ సమస్యను కూడా సాంకేతికంగా అధిగమించాం. 'పంప్డ్ స్టోరేజి' బ్యాటరీ పని తీరుకు సమానమైనది. 'పురూలియా' పవర్ గ్రిడ్‌లో మనకు ఈ సౌకర్యం ఉన్నది కాబట్టి సమస్యకు పరిష్కారం దొరికినట్లే. ఇందుకోసం 'గ్రిడ్'ల స్థాయిలో భారీ ఎలక్ట్రికల్ బ్యాటరీల అవసరం కూడా ఉండదు.

శిలాజ ఇంధన వినియోగం నుండి పునరుత్పాదక ఇంధన వినియోగం వైపు మళ్లడానికి మనకు కావల్సినదల్లా సౌర విద్యుత్ ఉత్పాదనకు అవసరమైన ఫలకాలు, పవన విద్యుత్ ఉత్పాదనకు అవసరమైన భారీ పంకాలు పరిశ్రమ స్థాయిలో ఉత్పత్తి చేసి నెలకొల్పుకోవడమే. తద్వారా మనం శిలాజ ఇంధనాల ప్లాంట్ల నుండి క్రమేపీ వైదొలగవచ్చు. గ్రిడ్‌ల మీద ప్రధానంగా దృష్టి కేంద్రీకరించి మనం విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తే ఇంధన సంబంధిత కర్బన ఉద్గారాలను 40 శాతం తగ్గించవచ్చు. గత పదేళ్ళుగా సౌర, పవన విద్యుత్ ఉద్పాదనలను గ్రిడ్‌లతో అనుసంధానించడం పెరిగింది. దానితో బొగ్గు, సహజ వాయువు, చమురు ఉపయోగించి ఉత్పత్తి చేసే ఒక కిలో వాట్ వ్యయం కన్నా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి వ్యయం చాలా స్వల్పంగా లెక్క తేలింది. 2023లో గ్రిడ్‌ల సామర్థ్యం పెంపు మూలంగా మనకు శిలాజ ఇంధనాల వినియోగం ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్ అవసరం లేకుండా పోయింది. ప్రపంచ వ్యాప్తంగా సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాలు పెరిగాయి. ముఖ్యంగా చైనా చాలా వేగం అందుకుంది. ప్రత్యామ్నాయ పునరుత్పాదక విధానం ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్ మూలంగా కర్బన ఉద్గారాలు తగ్గుముఖం పడతాయి. ప్రపంచ జనాభాలో 3/4వ వంతు జనాభా నివసిస్తున్న దేశాలకు ఇది ప్రయోజనకరం.

ఈ దిశగా చైనా చేపట్టిన కృషిని శ్లాఘిస్తూ 'న్యూయార్క్ టైమ్స్' ప్రచురించిన వ్యాసం చదివితే ఈ పత్రిక చైనా అభిమాన సంఘంలో చేరిపోయిందా అన్న అనుమానం రాకమానదు. "2023లో చైనా సహా ప్రపంచవ్యాప్తంగా 425 గిగావాట్‌ల సామర్థ్యంగల సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు స్థాపించారు. చైనా ఒక్కటే 263 గిగావాట్‌ల సామర్థ్యం గల ఉత్పత్తి కేంద్రాలు స్థాపిస్తే మిగిలిన ప్రపంచ దేశాలన్నీ కలిసి 162 గిగావాట్‌ల సామర్థ్యం గల ఉత్పత్తి కేంద్రాలను స్థాపించాయి. ఇందులో అమెరికా వాటా కేవలం 33 గిగావాట్‌లు. 2019లో ప్రపంచ సౌర విద్యుత్ సామర్థ్యంతో 1/4వ వంతు సామర్థ్యాన్ని ఒక్క చైనాయే సాధించింది. 2023 నాటికి అదే చైనా ప్రపంచ సౌర విద్యుత్ సామర్థ్యంలో 62 శాతం సొంతం చేసుకుంది. చైనా సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని ఎనిమిది రెట్లు పెంచుకుంది. చైనా ఉత్పత్తి సామర్థ్యం ఇంత పెద్ద ఎత్తున పెరగకుండా ఉంటే ప్రపంచ దేశాల సౌర విద్యుత్ సామర్థ్యం కనీసం రెట్టింపు పెరగడం కూడా సాధ్యపడేది కాదు' అని పత్రిక పేర్కొంది.

హరిత ఇంధన సామర్థ్యంలో చైనా అగ్రగామిగా, అమెరికా అట్టడుగున నిలిచాయి. ఐరోపా యూనియన్ దేశాలు, భారతదేశం 2023లో 13.5 గిగావాట్‌ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని జత చేశాయి. అయితే ఈ రెండు దేశాలు సౌర ఫలకాల ద్వారా విద్యుత్ ఉత్పాదన విధానం మీద ప్రధానంగా ఆధారపడ్డాయి. 'సెల్' ఉత్పత్తి విధానాన్ని పెంపొందించుకోలేదు. అదానీ సౌర విద్యుత్ సంస్థ, సెకిల మధ్యన ఆంధ్రప్రదేశ్‌కు ఏడు గిగావాట్‌ల సౌర విద్యుత్ ఉత్పత్తి కోసం జరిగిన ఒప్పందంలో ముడుపుల భాగోతం నడిచిందని అమెరికా న్యాయాధికారులు అభియోగాలు నమోదు చేయడం మూలంగా సౌర విద్యుత్ ఉత్పాదన మీద ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది.

ఐరోపా యూనియన్ దేశాలు హరిత ఇంధన విధానాలను రూపొందించి ఆర్భాటంగా ప్రకటించాయి. కానీ ఇప్పటికీ శిలాజ ఇంధనాల విద్యుత్ మీదనే ఎక్కువగా ఆధారపడ్డాయి.

ఇప్పుడు సమస్య పునరుత్పాదక ఇంధన ధరలు కాదు. అమెరికాలో చమురు, సహజ వాయువు, బొగ్గు ఆధారంగా ఉత్పత్తి చేస్తున్న విద్యుత్ సంస్థలు మూత పెట్టడం. మానవ నాగరికత పెను ప్రమాదం అంచున ఉన్నప్పటికీ అమెరికా ఈ కంపెనీల ప్రయోజనాలు ఎలా కాపాడాలా అని చూస్తున్నది. మన దేశంలో సంప్రదాయ ఇంధన వనరుల పరిశ్రమలను యాథాతథంగా కొనసాగించడానికి కర్బన వాణిజ్యం, కర్బన సుంకాల పేరిట కొత్త నాటకం మొదలు పెట్టింది. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను చారిత్రకంగా లెక్కించడం కాకుండా తాజా ఉద్గారాలను ప్రాతిపదికగా తీసుకోవడం అంటే అది వర్ధమాన దేశాల ప్రయోజనాలను దెబ్బ తీయడమే. ప్రస్తుత వాతావరణ సంక్షోభానికి కారణమైన ధనిక దేశాలు తమ బాధ్యత నుండి తప్పించుకోవడమే.

ఇంకా చెప్పాలంటే వాతావరణ మార్పులను అరికట్టే పేరిట సుంకాల ఆటంకాలు సృష్టిస్తున్నాయి. అమెరికా ప్రయోజనాలతో అంటకాగడం మూలంగా ప్రపంచ భవిష్యత్తునే కాకుండా స్వదేశీ పరిశ్రమల భవిష్యత్తును కూడా ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయి. రష్యాపై అమెరికా విధించిన ఆర్థిక ఆంక్షల కారణంగా దేశం నుండి చౌకగా లభించే చమురు, సహజ వాయువుల కొనుగోళ్ళు నిలిపి వేసి అమెరికన్ బహుళజాతి సంస్థల నుండి అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నాయి ఐరోపా దేశాలు.

ఇప్పుడు సమస్య పునరుత్పాదక ఇంధన ధరలు కాదు. అమెరికాలో చమురు, సహజ వాయువు, బొగ్గు ఆధారంగా ఉత్పత్తి చేస్తున్న విద్యుత్ సంస్థలు మూత పెట్టడం. మానవ నాగరికత పెను ప్రమాదం అంచున ఉన్నప్పటికీ అమెరికా ఈ కంపెనీల ప్రయోజనాలు ఎలా కాపాడాలా అని చూస్తున్నది. మన దేశంలో సంప్రదాయ ఇంధన వనరుల పరిశ్రమలను యాథాతథంగా కొనసాగించడానికి కర్బన వాణిజ్యం, కర్బన సుంకాల పేరిట కొత్త నాటకం మొదలు పెట్టింది. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను చారిత్రకంగా లెక్కించడం కాకుండా తాజా ఉద్గారాలను ప్రాతిపదికగా తీసుకోవడం అంటే అది వర్ధమాన దేశాల ప్రయోజనాలను దెబ్బ తీయడమే. ప్రస్తుత వాతావరణ సంక్షోభానికి కారణమైన ధనిక దేశాలు తమ బాధ్యత నుండి తప్పించుకోవడమే. భారత్, చైనా, టర్కీ, రష్యా, తూర్పు ఆసియా దేశాలలో చౌకగా ఉత్పత్తి అవుతున్న విద్యుత్ కొనుగోళ్లను దెబ్బ తియ్యడానికి 'కర్బన సుంకాల' విధింపు పేరిట అమెరికా–ఐరోపా యూనియన్ దేశాలు అక్రమాలకు పాల్పడుతున్నాయి.

2025లో అమెరికా అధ్యక్ష పీఠం అధిరోహించనున్న డొనాల్డ్ ట్రంప్, అర్జెంటీనా ప్రస్తుత అధ్యక్షుడు జేవియర్ మిలేలు ఇద్దరూ వాతావరణ మార్పులు అన్న అంశాన్ని కొట్టిపారేసే ఘనులు. రానున్న కాలంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అనేక విధానాలు తీవ్రమైన మార్పులకు గురయ్యే ప్రమాదం ఉన్నది. ప్రపంచం ఎలా పోయినా వీళ్ళకి బహుళజాతి సంస్థలు సంపాదించే లాభాల ప్రయోజనాలను కాపాడడమే ముఖ్యం. అంటే ప్రపంచం ఇవాళ రాజకీయంగా పెనుసవాల్‌ను ఎదుర్కోనున్నది. ఇది ఆర్థికపరమైన, సాంకేతిక పరమైన సవాలు కానే కాదు. విలువలతో కూడిన అంతర్జాతీయ వ్యవస్థ 'పేరిట అమెరికా ఇంత దుర్మార్గానికి పాల్పడుతుంటే జి–7 దేశాలు దానిని ఎదుర్కోవడానికి సాహసించడం లేదు. ప్రపంచ దేశాల మీద నయా వలస దోపిడీ కొనసాగుతున్నా ప్రశ్నించలేకుండా ఉన్నాయి. ఫ్రెంచి విప్లవానికి ముందు పదహారవ లూయిస్ చక్రవర్తి "నేను పోతే ప్రళయమే' అని హెచ్చరించిన చందంగా ధనిక దేశాలు వ్యవహరిస్తున్నాయి.

★

యుద్ధాలను ఎగదోసిన అమెరికా

సంక్షోభాల సుడిలో దేశాలు

అంతర్జాతీయం



పి.అజయ కుమార్

అమెరికా తనకు తానుగా, తన సహచర దేశాలతో కలిసి బాంబులు వేసి లక్షలాది మందిని చంపిన దేశాలు... అమెరికా ప్రోద్బలంతో అంతర్యుద్ధంలో విచ్ఛిన్నమైన దేశాలు... ఏవీ కూడా ఇంతవరకూ బతికి బట్ట కట్టలేదు. 13 సంవత్సరాల క్రితం లిబియా అధ్యక్షుడు గడాఫీని అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాల సైన్యాలు, అవి ప్రోత్సహించిన ఉగ్రవాద దళాలు కలిసి వీధుల్లో చంపేశాయి. లిబియాలోని చమురు రంగంపై బహుళ జాతి కంపెనీలకు పట్టు చిక్కింది. కానీ ఆ దేశం ఇంతవరకు స్థిరపడలేదు. ఉగ్రవాద గ్రూపుల మధ్య పదవుల కొట్లాట జరుగుతోంది.

పాలస్తీనా పౌరులను యథేచ్ఛగా ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్‌కు ఆయుధాలు అందించిన అమెరికా తన చేతులకు రక్తం పులుముకుంది. చమురు నిల్వలు కలిగిన పశ్చిమాసియా దేశాలపై తన పట్టు కోసం ఇజ్రాయిల్‌ను తురుపు ముక్కగా వాడుకుంటోంది. తన దన్నుతో ఇరాన్, లెబనాన్, ఇరాక్, సిరియా, యెమెన్ దేశాలపై ఇజ్రాయిల్ దాడి చేస్తోంది. స్వయంగా ఉగ్రవాద గ్రూపులకు ఆయుధాలు ఇచ్చి సిరియా ప్రభుత్వం పడిపోవటానికి తన వంతుగా ఆజ్యం పోసింది.

పాలస్తీనా ప్రజల ప్రాణాలకు విలువ లేకుండా చేసిన అమెరికా విదేశాంగ కార్యదర్శి బ్లింకెన్ పశ్చిమ ఆసియా చుట్టూ అనేక సార్లు ప్రదక్షిణలు చేశాడు. ఇజ్రాయిల్ – హమాస్ మధ్య కాల్పుల విరమణ జరగాలని శాంతి వచనాలు పలుకుతున్నాడు. కాని, పాలస్తీనా ప్రజల మరణాలు తక్కువ స్థాయిలో ఉండేలా చూడాలని ఇజ్రాయిల్‌ను కోరుతున్నాడు. పాలస్తీనా పౌరుల మరణాలకు విలువ లేకుండా చేసిన వైఖరి అమెరికాది. సౌదీ అరేబియా, ఈజిప్టు, ఖతార్, జోర్డాన్ తదితర అరబ్ దేశాల చుట్టూ తిరుగుతూ ఆ దేశాల పాలకులు తనకు, ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా ఏకం కాకుండా చూసుకుంటున్నాడు.

అమెరికా తనకు తానుగా, తన సహచర దేశాలతో కలిసి బాంబులు వేసి లక్షలాది మందిని చంపిన దేశాలు, అమెరికా ప్రోద్బలంతో అంతర్యుద్ధంలో విచ్ఛిన్నమైన దేశాలు ఏవీ కూడా ఇంత వరకూ బతికి బట్ట కట్టలేదు. 13 సంవత్సరాల క్రితం లిబియా అధ్యక్షుడు గడాఫీని అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాల సైన్యాలు, అవి ప్రోత్సహించిన ఉగ్రవాద దళాలు కలిసి వీధుల్లో చంపేశాయి. లిబియాలోని చమురు రంగంపై బహుళ జాతి కంపెనీలకు పట్టు చిక్కింది. కానీ ఆ దేశం ఇంతవరకు స్థిరపడలేదు. ఉగ్రవాద గ్రూపుల మధ్య పదవుల కొట్లాట జరుగుతోంది.

2003లో ఇరాక్‌పై అమెరికా, బ్రిటన్ సైన్యాలు బాంబు దాడులు జరిపి 10 లక్షల మంది పౌరులను చంపాయి. ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని పడగొట్టి ఉరి తీయించాయి. శవాలపై రాబందులు వాలినట్లుగా చమురు నిల్వలపై బహుళజాతి కంపెనీలు వచ్చి వాలాయి. కుక్కలు చింపిన విస్తరిలా తయారైన దేశాన్ని పునర్నిర్మించే బాధ్యత ఆ దేశ పాలకులపై పడింది. ఇప్పటికీ ఆ దేశంలో విస్తారంగా ఉన్న చమురు నిల్వలను బయటకు తీసే పరిస్థితి లేదు.


ఆల్‌ఖైదా, తాలిబాన్ ఉగ్ర దాడులను పెంచి పోషించి వాటితో ఆఫ్ఘనిస్తాన్ సోషలిస్ట్ ప్రభుత్వాన్ని పడగొట్టి ఆ దేశ అధ్యక్షుడ్ని నడి వీధిలో ఉరితీయించింది అమెరికా. అదే ఉగ్రవాదం చివరకు ఏకు మేకై తన దేశంలోని న్యూయార్క్‌పై విమానాలతో దాడి చేసింది. దీన్ని తుదముట్టించే పేరుతో ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా, కెనడాల సహకారంతో అమెరికా ఆఫ్ఘనిస్తాన్‌పై దాడి చేసి లక్ష మంది పౌరులను పొట్టన పెట్టుకుంది. అప్పటికే తాలిబాన్ నియంత్రణలో ఆఫ్ఘనిస్తాన్ ఉంది. చివరికి అదే మతతత్వ తాలిబాన్‌కు దేశాన్ని అప్పజెప్పి అమెరికా సైన్యాలు వెనుదిరిగాయి. ఆఫ్ఘనిస్తాన్ మాత్రం ఇంత వరకు కోలుకోలేదు. మత ఛాందసవాదం చేతిలోనే అది మగ్గుతోంది.

గత 20 సంవత్సరాల నుండి ఇరాన్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ఎన్ని ప్రయోగాలు చేసినా తాము విజయం సాధించలేకపోయామని అమెరికా విదేశాంగ కార్యదర్శి బ్లింకెన్ వాపోయాడు. ఆయిల్, ఆయుధ కంపెనీల ప్రయోజనాల కోసం అమెరికా తదితర సామ్రాజ్యవాద దేశాలు ఇతర దేశాల విచ్ఛిన్నానికి ఎంతకైనా పాల్పడతాయని ఆచరణలో రుజువైంది.

ఉత్తర అమెరికా, యూరప్ దేశాల కూటమి అయిన 'నాటో' రష్యా పొలిమేరల వరకు విస్తరించింది. తాజాగా తన మద్దతుదారు జెలెన్‌స్కీని 2019 ఉక్రెయిన్ ఎన్నికల్లో గెలిపించింది. ఉక్రెయిన్‌ను కూడా నాటోలో చేర్చుకోవాలని ప్రయత్నాలు మొదలు కావడంతో, తన రక్షణ కోసం రష్యా ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ప్రారంభించింది. ప్రత్యక్షంగా ఉక్రెయిన్–రష్యాల మధ్య యుద్ధంగా కనబడుతున్నప్పటికీ, వాస్తవంలో అది నాటో–ప్రత్యేకించి అమెరికా–రష్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధంగా కొనసాగుతోంది. అమెరికా, యూరప్ దేశాలు ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేసి దాన్ని యుద్ధ రంగంలో నిలబెడుతున్నాయి.

అమెరికాతో పోటీగా అణ్వాయుధాలు కలిగిన రష్యాను గెలవటం కష్టమని తెలిసినా అమెరికాకు తోడుగా రంగంలోకి దిగిన ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ తదితర యూరప్ దేశాలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. తమ ఇంధన అవసరాల కోసం రష్యాపై ఆధారపడ్డ యూరప్, ఇంధన కొరత వలన జీవన వ్యయ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. జీవన వ్యయ సంక్షోభం రాజకీయ సంక్షోభాలకు కూడా దారితీసింది.

యూరప్ ఖండంలోకెల్లా అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న జర్మనీ, అమెరికా, ఇతర పశ్చిమ దేశాలతో కలిసి రష్యాపై ఆర్థిక ఆంక్షలు విధించాయి. దీంతో జర్మనీతో పాటు ఇతర యూరప్ దేశాల ఆర్థిక వ్యవస్థలు కూడా దెబ్బతిన్నాయి. జర్మనీకి రష్యా సహజ వాయువును తీసుకువచ్చే పైపులైన్‌ను ఉక్రెయిన్ ధ్వంసం చేసింది. యుద్ధం పశ్చిమ దేశాల ఇంధన సంక్షోభాన్ని మరింత దిగజార్చింది. మరలా ఇది తిరిగి జీవన వ్యయ సంక్షోభాన్ని తీవ్రతరం చేసింది. ఆ తరువాత అది ఆర్థిక మాంద్యాన్ని ప్రేరేపించింది. ఫలితంగా యూరప్ అంతటా రాజకీయ అస్థిరత్వం నెలకొంది.



2021లో జరిగిన జర్మనీ ఎన్నికల్లో సోషల్ డెమోక్రాట్లు అత్యధిక స్థానాలు గెలుచుకున్నారు. గ్రీన్స్ మరియు మార్కెట్ అనుకూల ఫ్రీ డెమోక్రాట్లతో కలిసి సోషల్ డెమోక్రాట్లు ప్రభుత్వం ఏర్పాటు చేశారు. సంక్షోభాలను ఎదుర్కొనే అంశంలో ఈ పార్టీల మధ్య ఐక్యత లేదు. సోషల్ డెమోక్రాట్లు, గ్రీన్స్ ప్రభుత్వ ఖర్చును ఎక్కువ చేయాలని వాదించగా, ఫ్రీ డెమోక్రాట్లు ఖర్చు తగ్గించాలన్నారు. ఈ ప్రభుత్వం ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించలేకపోయింది. ఫ్రీ డెమోక్రాట్లు ప్రభుత్వం నుండి తప్పుకున్న తర్వాత పాలన సంక్షోభంలో పడింది. సోషల్ డెమోక్రాట్స్ ఛాన్సలర్ షోల్జ్ అవిశ్వాస తీర్మానంలో ఓడిపోయి రాజీనామా చేశాడు. 2025 ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్నాయి.

ఫ్రాన్స్‌లో కూడా రాజకీయ అస్థిరత్వం ఏర్పడింది. అధ్యక్షుడు నియమించిన ప్రధాన మంత్రులెవరూ విశ్వాస పరీక్షలో నెగ్గటం లేదు. మెజార్టీ పక్షంగా ఉన్న వామపక్ష ఫ్రంట్ నుండి ప్రధానిని నియమించటానికి మాక్రాన్‌కు అంగీకారం లేదు. ఉదారవాద విధానాలకు దానికి ప్రత్యామ్నాయ విధానాలకు మధ్య ఫ్రాన్స్‌లో ఘర్షణ జరుగుతోంది.

యూరప్ అంతటా పచ్చి మితవాద పార్టీలకు, నయా నాజీలకు బలం పెరుగుతోంది. ఇటలీ ఏకంగా పచ్చి మితవాద పార్టీ చేతుల్లోకి పోయింది. స్విట్జర్లాండ్‌లో మితవాదుల బలం పెరిగింది. బ్రిటన్‌లో అధికార లేబర్ పార్టీ కూడా ఉదార విధానాల వైపే మరలుతోంది. ఎన్నికల వాగ్దానాలకు విరుద్ధంగా పాలిస్తోంది. యూరప్, అమెరికా, కెనడాలలో వలస వ్యతిరేక మితవాదం బలం పుంజుకుంటోంది. ఎన్ని పాట్లు పడినా ఆర్థిక, రాజకీయ సంక్షోభాల నుండి పశ్చిమ దేశాలు బయటపడే పరిస్థితి లేదు. సామ్రాజ్యవాదానికి అంతిమంగా ఓటమి తప్పదు.

/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు /

కవిత్వం

దోమలపై దండయాత్ర

రోజుకో చిటికెడు రక్తం పీల్చే
చిన్న చిన్న దోమల మీద
పెద్ద ఎత్తున యుద్ధం ప్రకటిస్తుంటారే...!
మరి అదే పంతాన్నీ అదే పట్టుదలనీ
లీటర్ల కొద్దీ మీ రక్తాన్ని
గ్లాసుల్లో పోసుకొని స్ట్రాలతో జుర్రేస్తున్న
ఈ కార్పొరేట్ దోమల మీద
ఎందుకు చూపించరు?
ఫార్మాసిటీల్లాంటి విష రసాయన కర్మాగారాల్ని
మీ నివాస ప్రాంతాలకు చేరువలోనే నిర్మించేసి
ఈ మా ప్రయాస అంతా మీకు
ఉద్యోగాలిచ్చి ఉద్ధరించటానికే...!
అంటూ పోతు కబుర్లు ఆడినంత మాత్రాన
పొంచివున్న ప్రమాదాన్ని అంచనా వెయ్యకపోతే ఎట్లా?
రోజూ చూస్తూనే వున్నారుగా
ఈ కంత్రీ దోమలు విసర్జిస్తోన్న వ్యర్థాలు
అటు సముద్ర జలాల్లో కలిసి
మత్స్యకారుల మనుగడకు చిచ్చు పెడుతూ
ఇటు మంచినీళ్ళ కుంటల్లో కలిసి
మీ గుండె, కాలేయం, ఊపిరి తిత్తుల్నే కాక
మీ ఇల్లూ, ఒళ్ళూ, పిల్లల ఆరోగ్యాన్ని సైతం
ఎట్లా కుక్కలు పీకిన విస్తరి లెక్క
మార్చేస్తున్నాయో..!
సరే, రోజూ ఎదురయ్యే
ఈ క్లేశాల్ని కాస్త పక్కన పెడితే
హఠాత్తుగా ఏ అర్ధరాత్రో ఏ రియాక్టరో పేలి
ఏ విష వాయువో లీకై, కార్మికుల ప్రాణాలు
గాలిలో కలిసిపోతే...
గుండె పగిలి రోదించే ఆ కుటుంబాలను
ఆదుకునే దిక్కెవ్వరు?
కొంచెం ఆలోచించండి!
కళ్ళ ముందు కళ తప్పుతున్న
బతుకు చిత్రాన్ని అవలోకించండి
మీ శక్తుల్నీ మీ చైతన్యాన్నీ పూర్తిగా
పిండుకు తాగి మిమ్మల్ని
చెండుకు తినక ముందే
ఈ పుండాకోరు దోమల మీద
యుద్ధం ప్రకటించండి!!

- పతివాడ నాస్తిక్,
సెల్ : 94417 24167

పంజాబ్‌తో మొదలైన ప్రస్థానం

- అవిభక్త భారతావనిలో పంజాబ్ ప్రావిన్సు (ప్రస్తుతం పాకిస్తాన్)లోని గ్రామంలో గురుముఖ్‌సింగ్, అమృత్ కౌర్ దంపతులకు 1932 సెప్టెంబరు 26న మన్మోహన్‌సింగ్ జన్మించారు. ఆయన మాతృమూర్తి మరణం తర్వాత నానమ్మ దగ్గర పెరిగారు.
- 1947లో దేశ విభజన సమయంలో ఆయన కుటుంబం భారత్‌లోని అమృత్ సర్‌కు వలస వచ్చి అక్కడే స్థిరపడింది.
- 1948లో మెట్రిక్యులేషన్ పూర్తి చేసిన ఆయన 1952-54 మధ్యకాలంలో పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్, మాస్టర్స్ డిగ్రీలను పొందారు.
- 1957లో కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్ హానర్స్ డిగ్రీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. అనంతరం భారత్ తిరిగొచ్చిన ఆయన పంజాబ్ విశ్వవిద్యాలయంలోనే ఉపాధ్యాయునిగా సేవలందించారు.
- 1958లో గురుశరణ్ కౌర్‌తో వివాహం జరిగింది. వీరికి ఉపిందర్, దామన్, అమృత అనే ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.
- 1960లో ఫిలాసఫీలో డాక్టరేట్ కోసం ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి వెళ్లారు. 1962లో ఇదే యూనివర్సిటీలోని నఫీల్డ్ కళాశాల నుంచి ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ పొందారు.
- 1963 పంజాబ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా ఎదిగారు.
- 1966లో ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో హానరరీ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు.
- 1966-69లో వాణిజ్యం, అభివృద్ధి అంశాలపై ఐక్యరాజ్యసమితి సదస్సు కోసం మన్మోహన్‌సింగ్ తన సేవలందించారు.
- 1969-71లో ఢిల్లీ వర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఇంటర్నేషనల్ ట్రేడ్ ప్రొఫెసర్‌గా సేవలందించారు.
- 1971లో భారత ప్రభుత్వంలో వాణిజ్య మంత్రిత్వ శాఖలో ఆర్థిక సలహాదారుగా సింగ్ నియమితులయ్యారు.
- 1972-76లో ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రధాన ఆర్థిక సలహాదారుగా ఆయన సేవలందించారు.
- 1976లో ఆర్థికమంత్రిత్వ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో హనోరరీ ప్రొఫెసర్‌గానూ సేవలందించారు.
- 1976-80లో భారత రిజర్వుబ్యాంకు డైరెక్టరుగా బాధ్యతలు నిర్వర్తించారు.



2023లో రాజ్యసభకు హాజరైన మన్మోహన్ సింగ్

- 1980-82లో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులుగా సేవలందించారు.
- 1982-85 మధ్యకాలంలో భారత రిజర్వుబ్యాంకు గవర్నరుగా సేవలందించారు.
- 1985-87లో ప్రణాళిక సంఘం అధిపతిగా బాధ్యతలు చేపట్టారు.
- 1987లో ఆర్థిక రంగాన అందించిన సేవలకు రెండో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మ విభూషణ్ పురస్కారం అందుకున్నారు.
- 1987-90లో స్విట్జర్లాండ్‌లోని జెనివా కేంద్రంగా పనిచేస్తున్న స్వతంత్ర ఆర్థిక విధాన మేధోసంస్థ అయిన 'సౌత్ కమిషన్'కు ప్రధానకార్యదర్శిగా నియమితులయ్యారు.
- 1990-91లో ప్రధానమంత్రి ఆర్థిక వ్యవహారాల సలహాదారు పదవి పొందారు.
- 1991 మార్చిలో యూనివర్శిటీ గ్రాంట్ కమిషన్ (యుజిసి) ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఇదే ఏడాది జూన్‌లో పివి నరసింహారావు ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టగా మన్మోహన్‌సింగ్‌ను ఆయన ఆర్థికమంత్రిగా ఎంపిక చేసుకున్నారు. ఇదే ఏడాది అస్సాం శాసనసభ ఆయనను రాజ్యసభ సభ్యునిగా ఎన్నుకొని పార్లమెంటుకు పంపించింది. 1995, 2001, 2007, 2013, 2019లోనూ ఆయన ఎగువ సభకు ఎన్నికవుతూవచ్చారు.
- 1991-96లో ఆర్థిక సంక్షోభ సమయంలో సరళీ కరణ విధానాలకు మన్మోహన్‌సింగ్ తలుపులు తెరిచారు. ఉత్పత్తి పెంపుదల లక్ష్యంతో ఉదారవాద ఆర్థిక సరళీకరణ విధానాలను అమల్లోకి తీసుకొచ్చారు. ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ నియంత్రణను సడలించారు. దిగుమతి సుంకాలను బాగా తగ్గించారు.
- 1998-2004లో రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా మన్మోహన్‌సింగ్ ఎన్నికయ్యారు.
- 2004 మే 22న ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ పదవి చేపట్టిన ప్రప్రథమ హిందూయేతర నేతగా ఆయన రికార్డు సృష్టించారు.
- 2004-09 మధ్యకాలంలో నాటి ఆర్థిక మంత్రి పి చిదంబరంతో కలిసి దేశ ఆర్థిక రంగాన్ని పురోభివృద్ధిలో పయనింపజేసే చర్యలు చేపట్టారు. దేశ ఆర్థిక వృద్ధి రేటు '8-9 శాతానికి ఎగబాకింది.
- వామపక్షాల చొరవతో 2005లో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎ), జాతీయ గ్రామీణ ఆరోగ్య మిసన్ (ఎన్‌హెచ్ఆర్ఎం) వంటి గొప్ప పథకాలను అమల్లోకి తీసుకొచ్చారు. ఎన్‌హెచ్ఆర్ఎం ద్వారా 5 లక్షల మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.
- జూన్ 15, 2005లో సమాచార హక్కు చట్టాన్ని తీసుకొచ్చారు.
- జులై 18, 2005లో భారత్-అమెరికా అణు ఒప్పందానికి నాటి అమెరికా అధ్యక్షులు జార్జి డబ్ల్యు బుష్‌తో కలిసి మన్మోహన్‌సింగ్ కార్యాచరణను ప్రకటించారు. పౌర, సైనిక అణు కార్యకలాపాలను వేరు చేసి అన్ని పౌర అణు కార్యకలాపాలను అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ పర్యవేక్షణ అనుమతిపత్రానికి అంగీకరించింది.
- 2006లో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్), ఐఐటీలు, ఐఐఎంలలోనూ, ఇతర కేంద్ర ఉన్నత విద్యా సంస్థలన్నిటిలోనూ వెనుకబడిన తరగతులకు (ఒబిసిలకు) 27 శాతం సీట్లను రిజర్వుచేయాలన్న ప్రతిపాదనలను ఆమోదించారు.
- 2007లో దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) తొలిసారి 9 శాతానికి పెరిగింది. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రెండో దేశంగా ఎదిగింది.
- 2008లో అంతర్జాతీయ అణు ఇంధన సంస్థతో భారత్ అణు ఒప్పందం చేసుకుంది. అణు ఇంధన వ్యాపారానికి తలుపులు తెరిచిన తొలి అణ్వాయుధ దేశంగా నిలిచింది. అమెరికా అణు కంపెనీల లబ్ధి కోసమే ఈ ఒప్పందం చేసుకున్నారంటూ అప్పట్లో దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. దేశ సార్వభౌమత్వానికి ఈ ఒప్పందం చేటు చేస్తుందని హెచ్చరించిన సిపిఎం, ఇతర వామపక్షాలు నాటి యుపిఎకి మద్దతు ఉపసంహరించుకున్నాయి.
- 2008లో ముంబయి ఉగ్రవాద దాడుల నేపథ్యంలో జాతీయ భద్రత సంస్థ (ఎన్ఐఎ)ను మన్మోహన్‌సింగ్ ఏర్పాటు చేసింది.
- 2009 మే 22లో రెండో సారి ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ బాధ్యతలు చేపట్టారు. 1962లో జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకొని వరుసగా రెండో సారి ప్రధాని పదవిని చేపట్టిన నేతగా మన్మోహన్ సింగ్ రికార్డులకెక్కారు.
- 2009 జులై 2న 14 ఏళ్లలోపు చిన్నారులందరికీ విద్యను తప్పనిసరి చేస్తూ విద్యా హక్కు చట్టాన్ని (ఆర్‌టిఇ)ని మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది.
- 2010లో సౌదీ అరేబియా ప్రభుత్వం మన్మోహన్‌కు కింగ్ అబ్దులజీజ్ స్పెషల్ క్లాస్ ఆర్డర్‌తో సత్కరించింది.
- 2012లో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం వరుస కుంభకోణాల్లో చిక్కుకుంది. ప్రధానంగా మూడు కుంభకోణాలు.. స్పెక్ట్రమ్ కేటాయింపుల కుంభకోణం, బొగ్గు కుంభకోణం, కామన్వెల్త్ గేమ్స్ కుంభకోణాల ఆరోపణలతో నాటి ప్రభుత్వం అపఖ్యాతిపాలైంది.
- 2014లో జపాన్ ప్రభుత్వం మన్మోహన్‌సింగ్‌ను పాల్వోనియా ఆర్డర్ గ్రాండ్ కార్డాన్ పురస్కారంతో గౌరవించింది.
- బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ 2014 లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందడంతో అదే ఏడాది మే 17న మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో నరేంద్ర మోడీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు.
- 2014 మే 3న రాజ్యసభ సభ్యునిగా 33 ఏళ్ల సుదీర్ఘ పార్లమెంటరీ ప్రస్థానానికి ముగింపు పలికారు.
- 2024 డిసెంబరు 26న 92 ఏళ్ల వయస్సులో ఆయన తుది శ్వాస విడిచారు.

తొలిరోజు చెరో సగం

- ఆస్ట్రేలియా 311/6
- బుమ్రాకు మూడు వికెట్లు



మెల్‌బోర్న్: బాక్సింగ్ డే టెస్టులో తొలి రోజు ఆటలో ఆస్ట్రేలియా తొలి రెండు సెషన్లలో ఆధిపత్యం చెలాయించినా.. చివర్లో భారత బౌలర్లు వరుసగా వికెట్లు తీశారు. దీంతో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ 86 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 311 పరుగులు చేసింది. ఆసీస్ బ్యాటర్లలో కాన్‌స్టాస్(60), ఖావాజా(57), లబుషేన్(72), స్మిత్(68బ్యాటింగ్) అర్ధ సెంచరీలతో రాణించారు. తొలుత టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బ్యాటింగ్ ఎంచుకుంది. 19ఏళ్ల యువ బ్యాటర్ సామ్ కొన్‌స్టాస్.. మెల్‌బోర్న్ టెస్టులో అరంగేట్రం చేశాడు. భారత పేస్ బౌలర్లను అతను ధీటుగా ఎదుర్కొన్నాడు. తొలి టెస్టులోనే అర్ధసెంచరీతో మెరిసాడు. వ్యక్తిగత స్కోర్ 60పరుగుల వద్ద జడేజా బౌలింగ్‌లో ఔటయ్యాడు. తొలి వికెట్‌కు కొన్‌స్టాస్, ఖవాజా 89పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి స్టీవ్ స్మిత్ 68, ప్యాట్ కమ్మిన్స్ 8 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. ఈ టెస్టుకు భారత జట్టు ఓ మార్పు చేసింది. గిల్‌ను పక్కన పెట్టేసి.. వాషింగ్టన్ సుందర్‌ను జట్టులోకి తీసుకుంది. ఆసీస్ టాపార్డర్ నలుగురు బ్యాటర్లు అర్ధ సెంచరీలు చేసినా.. తొలిరోజే ఆరు వికెట్లు పడగొట్టి భారత బౌలర్లు రాణించడం విశేషం. బాక్సింగ్ డే టెస్ట్ తొలిరోజు ఆటను ప్రత్యక్షంగా వీక్షించేందుకు సుమారు 88 వేల మంది ప్రేక్షకులు హాజరయ్యారు. భారత బౌలర్లలో బుమ్రా మూడు, ఆకాష్ దీప్, సుందర్, జడేజా తలా వికెట్ సాధించారు.

కోహ్లికి జరిమానా

మెల్‌బోర్న్ వేదికగా జరుగుతున్న బాక్సింగ్ డే టెస్టులో విరాట్ కోహ్లి జరిమానాకు గురయ్యాడు. ఆసీస్ అరంగేట్ర ఆటగాడు సామ్ కాన్‌స్టాస్‌తో వివాదం కారణంగా కోహ్లికి ఐసిసి జరిమానా విధించింది. తొలి రోజు ఆటలో ఆసీస్ ఓపెనర్ కాన్‌స్టాస్‌ను కోహ్లి కవ్వింపు చర్యలకు ఉపక్రమించినట్లు ఐసిసి ఓ ప్రకటనలో వెల్లడించింది. మ్యాచ్ ఫీజులో 20 శాతం కోత ఒక డి మిరిట్ పాయింట్‌ను విధించినట్లు పేర్కొంది. ఓవర్ పూర్తయ్యాక పిచ్‌పై అవతలి ఎండ్ వైపు నడిచి వెళుతున్న కాన్‌స్టాస్‌ను విరాట్ కోహ్లి తన భుజంతో బలంగా ఢీకొన్నాడు. దీంతో వారిద్దరి మధ్య చిన్నపాటి మాటల యుద్ధం చోటు చేసుకుంది. అయితే యువ క్రికెటర్ పట్ల కోహ్లి వ్యవహరించిన తీరును చాలా మంది మాజీ క్రికెటర్లు తప్పుబడుతున్నారు. ఒక సీనియర్ క్రికెటర్ అయివుండి అలా ప్రవర్తించడం సరికాదని అభిప్రాయపడుతున్నారు.

స్కోర్‌బోర్డు...

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: కోన్‌స్టాస్ (ఎల్‌బి)జడేజా 60, ఖవాజా (సి)రాహుల్ (బి)బుమ్రా 57, లబూషేన్ (సి)కోహ్లి (బి)సుందర్ 72, స్మిత్ (బ్యాటింగ్) 68, హెడ్ (బి)బుమ్రా 0, మిచెల్ మార్ష్ (సి)పంత్ (బి)బుమ్రా 4, క్యారీ (సి)పంత్ (బి)ఆకాశ్‌దీప్ 31, కమిన్స్ (బ్యాటింగ్) 8, అదనం 11. (86ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 311పరుగులు. **వికెట్ల పతనం:** 1/89, 2/154, 3/237, 4/240, 5/246, 6/299 **బౌలింగ్:** బుమ్రా 21-7-75-3, సిరాజ్ 15-2-69-0, ఆకాశ్‌దీప్ 19-5-59-1, జడేజా 14-2-54-1, నితీశ్ 5-0-10-0, సుందర్ 12-2-37-1.

జమిలితో ప్రజాస్వామ్యానికి ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

వక్రీకరించారని చంద్రబాబు సమర్థించడం సరికాదన్నారు. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ఈ నెల 30న దేశవ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరసనలు చేపడతామని తెలిపారు. బిజెపికి తొత్తుగా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తోందని, అందులో భాగంగానే ఎన్నికల సమాచారం ఇచ్చే నిబంధనల్లో మార్పులు చేసిందని తెలిపారు. రాష్ట్రంలో టిడిపి కూటమి సర్కార్ పాలన ప్రజల్లో పూర్తి అసంతృప్తిని మిగులుస్తోందన్నారు. చంద్రబాబు ఒకప్పుడు విజన్ 2020 అన్నారని, ఇప్పుడు విజన్ 2047 అంటున్నారని తెలిపారు. చంద్రబాబు విజన్‌లో అంకెలు మారతాయి గానీ అభివృద్ధి ఉండదన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే అమరావతి నిర్మాణం జరుగుతుందని భావించారని, అయితే అమరావతి పేరుతో రూ.13 వేల కోట్లు అప్పు చేశారు గాని అమరావతికి కొత్తగా ఏమీ ఒరిగేటట్టు కన్పించడం లేదన్నారు. పోలవరం నిర్మాణంపైనా అనుమానాలే ఉన్నాయన్నారు. గత ప్రభుత్వంలో డయాఫ్రమ్ వాల్, నిర్మాణంలో అవినీతి జరిగిపోయిందని నానాయాగీ చేసి ఇప్పుడు అదే కాంట్రాక్టర్‌తో పనులు కొనసాగించడం ఏమిటని ప్రశ్నించారు. జిఎస్‌టి వసూళ్లలో ఆయా రాష్ట్రాలకు 50 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సంధ్య థియేటర్ తొక్కిసలాటకు తొలుత తప్పు పట్టాల్సింది హీరో అల్లు అర్జున్‌నే అని, ఘోరం జరిగిన వెంటనే హీరో, పరిశ్రమ పెద్దలు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఉండాల్సిందన్నారు. ఎం.ఎ.బేబీ మాట్లాడుతూ.. మోడీ హయాంలో క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. మూడోసారి మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో మైనార్టీలపై దాడులకు సంబంధించి 745 కేసులు నమోదయ్యాయని చెప్పారు. వీటిలో 200 కేసులు చర్చిలపై దాడుల ఘటనలే ఉన్నాయని అన్నారు. ప్రజల మధ్య ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి చిచ్చులు పెడుతూ విఘాతం కలిగిస్తున్నాయని మండిపడ్డారు.

బాబుకు విశాఖ ఉక్కు పట్టదా? : వి. శ్రీనివాసరావు

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకోవడానికి మోడీని చంద్రబాబుకు ఎందుకు అడగడం లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. రెండురోజుల క్రితం ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు అనకాపల్లిలో మిట్టల్ ఏర్పాటు చేస్తున్న ఉక్కు ఫ్యాక్టరీకి అనుమతులు, ముడిసరుకులు అన్నీ వెంటనే ఇచ్చేయాలని ప్రధాని మోడీని, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో మాట్లాడి వచ్చారన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్నీ మూసేసి పక్కన ఉన్న అనకాపల్లి ఉక్కు ఫ్యాక్టరీ కోసం కార్పొరేట్ వ్యక్తులకు ప్రభుత్వ భూములు కట్టబెట్టడానికి కూడా చంద్రబాబు సిద్ధమవుతున్నారని విమర్శించారు. కడప జిల్లాలో ఉన్న ఉక్కు ఫ్యాక్టరీకి శంకుస్థాపన మీద శంకుస్థాపనలు చేస్తున్నారని, కానీ ఆచరణలో ఒక్క అడుగు కూడా ముందుకు పడటంలేదని విమర్శించారు. విశాఖ డెయిరీపై రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ కమిటీ వేసిందని, ఈ కమిటీ కొనసాగాలని, దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఆగని ఇజ్రాయిల్ దాడులు..

- పలువురు జర్నలిస్టులు మృతి

జెరూసలేం: గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఇజ్రాయెల్ సైన్యం జరిపిన దాడిలో ఐదుగురు జర్నలిస్టులు మరణించారని ఎన్‌క్లేవ్ ఆరోగ్య అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్ దాడులకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

సెంట్రల్ గాజాలోని నుసిరత్‌లో ఉన్న అల్-అవ్దా ఆసుపత్రి పరిసరాల్లో ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడులు చేసింది. ఈ దాడిలో ఐదుగురు జర్నలిస్టులు మరణించారు. వీరంతా అల్-ఖుద్స్ అల్-యూమ్ టెలివిజన్ ఛానెల్‌లో పనిచేస్తున్నట్టు సమాచారం. పాలస్తీనా మీడియా కథనాల ప్రకారం.. జర్నలిస్టులు ఆసుపత్రి లోపల నుంచి వస్తున్న సమయంలో ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. దీంతో వారు చనిపోయారు అని తెలిపింది. ఇక, మరణించిన జర్నలిస్టులను ఫాది హస్సౌనా, ఇబ్రహీం అల్-షేక్ అలీ, మహ్మద్ అల్-లదా, ఫైసల్ అబూ అల్-కుమ్సన్, అయ్మాన్ అల్-జాదీగా గుర్తించినట్లు అల్ జజీరా నివేదించింది.

కాగా, గురువారం ముందుగా అంతకుముందు ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఐదుగురు పౌరులు మరణించగా మరో 20 మంది గాయపడ్డారు. గాజా నగరంలోని జైటౌన్ పరిసరాల్లోని ఒక ఇంటిపై ఇజ్రాయెల్ వైమానిక దాడి సందర్భంగా వీరంతా గాయపడ్డారు. శిథిలాల కింద చాలా మంది చిక్కుకుపోవడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు తెలిపారు.

సైన్స్‌తో మాకేం పని?

- నిపుణుల హెచ్చరికలు బేఖాతరు
- నదుల అనుసంధానంపై కేంద్రం మొండిపట్టు



న్యూఢిల్లీ : క్రిస్మస్ పర్వదినం రోజున ప్రధాని నరేంద్ర మోడీ మధ్యప్రదేశ్‌లోని ఖజురహోలో కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుకు భూమిపూజ చేశారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకొని మోడీ ప్రారంభించిన అనేక అభివృద్ధి ప్రాజెక్టులలో ఇది ఒకటి. నదుల అనుసంధానాన్ని ఆయన ఈ సందర్భంగా ఘనంగా కీర్తించారు. 21వ శతాబ్దపు అతి పెద్ద సవాళ్లలో నీటి కొరత ఒకటని, ఈ ప్రాజెక్టుతో మధ్యప్రదేశ్‌లో ఆ సమస్య తొలగిపోతుందని చెప్పారు.

ప్రభుత్వ లెక్కల ప్రకారం...కెన్-బెట్వా నదుల అనుసంధానం ప్రాజెక్టు ద్వారా 103 మెగావాట్ల జల విద్యుత్తును, 27 మెగావాట్ల సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చు. 62 లక్షల మందికి తాగునీరు, ప్రతి ఏటా 10.62 లక్షల హెక్టార్ల భూమికి సాగునీరు అందుతుంది. 230 కిలోమీటర్ల కాలువను నిర్మించి దాని ద్వారా మధ్యప్రదేశ్‌లోని కెన్ నది నుండి ఉత్తరప్రదేశ్‌లోని బెట్వాకు నీటిని పంపుతారు.

అయితే నదుల అనుసంధాన్ని సైన్స్ తప్పు పడుతోంది. ఎందుకంటే ఒక ప్రాంతపు జీవావరణం, పర్యావరణం, ప్రజలపై పడే ప్రభావం దీనితో ముడిపడి ఉంటాయి. నదుల అనుసంధానం అంటే ఏదైనా ఒక నదిలో అవసరానికి మించి మిగులు నీరు ఉంటే దానిని నీటి నిల్వలు అడుగంటుతున్న నదులకు తరలించడం. అయితే మిగులు నీరు, నీటి కొరత అనే భావనలే తప్పని జల శాస్త్రవేత్త కృష్ణస్వామి చెప్పారు. నదులు, వాటి ప్రవాహాలపై ఆయన 30 సంవత్సరాలకు పైగా అధ్యయనం చేస్తున్నారు. సహజ వ్యవస్థలలో నీరు ఎన్నటికీ వృథాగా పోదు. ప్రజలు ఉపయోగించని నదీ జలాలు దిగువకు ప్రవహిస్తాయి. అది ఇతర ప్రాంతాల ప్రజలకు, జలచరాలకు ఉపయోగపడుతుంది. కాబట్టి నదులు ప్రవహించాలి. అవి సముద్రంలో కలవాలి. దానికి అడ్డుకట్ట వేయడం, మళ్లించడం అనేది సరికాదు. అలా చేస్తే నది అనేది కేవలం నీటి ప్రవాహానికి మాత్రమే పరిమితం అవుతుంది.

పైగా ప్రభుత్వం తన వాదనకు మద్దతుగా జల సంబంధమైన సమాచారాన్ని విడుదల చేయడం లేదు. కెన్‌లో మిగులు నీరు ఉన్నదని, బెట్వాలో నీరు లేదని చెప్పేందుకు దాని వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. నదుల అనుసంధానం అనేది భయంకరమైన ఆలోచన అని ఇటీవల జరిపిన ఓ అధ్యయనం చెప్పింది. ఎందుకంటే అది దేశంలో వేసవి వర్షాలను మార్చేస్తుంది. కొన్ని సీజన్లలో నదులను ఎండబెడుతుంది. ఈ ప్రాజెక్టుల ద్వారా ఇతర ప్రాంతాలలో నీటి పారుదల సౌకర్యాన్ని పెంచితే దేశంలోని అనేక చోట్ల సెప్టెంబరులో వర్షపాతం 12 శాతం తగ్గుతుందని అధ్యయనం తెలిపింది. రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఒడిషా, పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాలలో నీటి సమస్య తలెత్తుతుంది.

నదుల అనుసంధానం ప్రాజెక్టులు చేపడితే ప్రజలు నిరాశ్రయులయ్యే ప్రమాదం ఉంది. అటవీ ప్రాంతాలలో అడ్డు వచ్చిన లక్షలాది చెట్లను నరికేస్తారు. వన్య ప్రాణుల సంరక్షణ కేంద్రాలు నీట మునుగుతాయి. కొన్ని అరుదైన పక్షి జాతులు అంతరిస్తాయి. నిర్మాణ పనుల కారణంగా పర్యావరణం దెబ్బతింటుంది. సైన్స్‌ను కాదని ప్రభుత్వం మొండిగా నదుల అనుసంధాన ప్రాజెక్టులతో ముందుకు సాగడం తగని పని అని జల నిపుణులు హెచ్చరిస్తున్నారు.

తిప్పేపల్లిలో సైబీరియన్ పక్షులు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్ (సత్యసాయి జిల్లా)

సత్యసాయి జిల్లా ధర్మవరం మండల పరిధిలోని తిప్పేపల్లి గ్రామ పొలాల్లో సైబీరియాన్ పక్షులు విహరిస్తున్నాయి. వరి నాట్లు వేస్తున్న పొలాల్లో విహరిస్తూ కనువిందు చేస్తున్నాయి. వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న సైబీరియా దేశం నుంచి తిప్పేపల్లికి వచ్చిన పక్షులు తమ పొలాల్లో విహరిస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బిజెపి ఖాతాలోనే అధిక విరాళాలు

- గత ఏడాది రెండు వేల కోట్లకు పైగా నిధులు



న్యూఢిల్లీ : గత ఆర్థిక సంవత్సరంలో బిజెపికి రూ.2,244 కోట్ల విరాళాలు లభించాయి. 2022-23లో ఆ పార్టీకి వచ్చిన విరాళాలతో పోలిస్తే ఇది మూడు రెట్లు అదనం. బిజెపికి ప్రుడెంట్ ఎలక్టొరల్ ట్రస్ట్ అందరి కంటే అధిక మొత్తంలో విరాళం అందించింది. గత ఆర్థిక సంవత్సరంలో కాంగ్రెస్‌కు రూ.288.9 కోట్ల విరాళాలు అందాయి. 2022-23లో కాంగ్రెస్‌కు వచ్చిన విరాళాల మొత్తం రూ.79.9 కోట్లు మాత్రమే. బిజెపికి రూ.20,000, ఆ పైన విరాళం అందించిన వారిలో వ్యక్తులు, ట్రస్ట్‌లు, కార్పొరేట్ సంస్థలు ఉన్నాయి.

2023-24లో బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు అందిన విరాళాల వివరాలు ఇప్పుడు ఎన్నికల కమిషన్ వెబ్‌సైటులో అందుబాటులో ఉన్నాయి. ప్రుడెంట్ ఎలక్టొరల్ ట్రస్ట్ నుండి బిజెపికి, రూ.723.6 కోట్లు, కాంగ్రెస్‌కు రూ.156.4 కోట్ల విరాళాలు అందాయి. 2022-23లో ప్రుడెంట్ ట్రస్ట్‌కు అధిక మొత్తంలో విరాళాలు అందించిన వారిలో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్, సెరమ్ ఇన్‌స్టిట్యూట్, ఆర్సెలర్ మిట్టల్ గ్రూప్, భారతి ఎయిర్‌టెల్ ఉన్నాయి. బిజెపికి, కాంగ్రెస్ పార్టీలు ప్రకటించిన మొత్తం విరాళాల వివరాలలో ఎన్నికల బాండ్ల ద్వారా అందిన విరాళాలను చేర్చలేదు.

తమకు ఎన్నికల బాండ్ల ద్వారా లభించిన విరాళాల సమాచారాన్ని కొన్ని ప్రాంతీయ పార్టీలు 2023-24లో స్వచ్ఛందంగా ప్రకటించాయి. వీటిలో బీఆర్‌ఎస్, డీఎంకే, వైసీపీ, జేఎంఎం ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో అన్ని పార్టీల కంటే బీజేపీకే అత్యధికంగా విరాళాలు సమకూరాయి. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే గత ఏడాది బీజేపీకి 212 శాతం ఎక్కువగా విరాళాలు అందాయి. ఎలక్టొరల్ ట్రస్టుల ద్వారా ఆ పార్టీకి సమకూరిన మొత్తం రూ.850 కోట్లు. గత ఆర్థిక సంంవత్సరంలో ప్రుడెంట్ ట్రస్ట్ బీఆర్‌ఎస్, వైసీపీకి కూడా విరాళాలు ఇచ్చింది. ఈ రెండు పార్టీలు ఎన్నికలలో పరాజయం పాలైన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు అధికారంలో ఉన్న టీడీపీకి ప్రుడెంట్ ట్రస్ట్ నుండి రూ.33 కోట్ల విరాళం అందింది.

గత సంవత్సరం బీజేపీకి విరాళాలు అందించిన సంస్థలలో ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీస్ ఒకటి. ఇది లాటరీ కింగ్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన శాంటినో మార్టిన్‌కు చెందిన సంస్థ. మనీ లాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న మార్టిన్‌పై ఈడీ, ఐటీ అధికారులు దృష్టి సారించారు. సీపీఐ (ఎం)కు 2022-23లో రూ.6.1 కోట్ల విరాళం అందగా గత ఏడాది రూ.7.6 కోట్లు వచ్చాయి. ఆప్, బీఎస్పీ, నేషనల్ పీపుల్స్ పార్టీ, బీజేడీ, టీడీపీ, సమాజ్‌వాదీ పార్టీలు కూడా తమకు అందిన విరాళాల వివరాలను ప్రకటించాయి. గత ఆర్థిక సంవత్సరంలో టీడీపీకి రూ.100 కోట్లకు పైగా విరాళాలు అందాయి.

రేపటి నుంచి ఓటీటీలో 'కేసీఆర్' స్ట్రీమింగ్



జబర్దస్త్ షోతో కమెడియన్‌గా గుర్తింపు తెచ్చుకున్న రాకింగ్ రాకేష్ నటుడిగా నటించి నిర్మించిన చిత్రం 'కేసీఆర్ (కేశవ చంద్ర రమావత్)' నవంబర్ 22న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా కొంతమేరకు ప్రతికూల ఫలితాలనే అందుకుంది. గరుడవేగ అంజి దర్శకత్వం వహించారు. తెలంగాణా ఉద్యమ నేపథ్యం, కొత్తగా ఏర్పడిన తెలంగాణాకు తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఎన్నికైన పరిణామాలకు ఓ లంబాడీ యువకుడి జీవిత ప్రయాణాన్ని జోడించి ఈ సినిమాను తెరకెక్కించారు. సత్యకృష్ణన్ కుమార్తె అనన్య కృష్ణన్ నటిగా నూతన పరిచయం అయ్యారు. ఈ నెల 28 నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది.

జాతీయస్థాయి వేమన పద్యాల పోటీలకు ఆహ్వానం

ప్రజాశక్తి- గంగవరం (తిరుపతి)

యోగి వేమన జయంతి సందర్భంగా స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి వేమన పద్యాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు తులసీనాద నాయుడు తెలియజేశారు. జనవరి 15వ తేదీ లోపు ఆసక్తి గల వారు నూరు పద్యాలకు పైగా వేమన పద్యాలు చెప్పేవారు ఈ కార్యక్రమానికి అర్హులని తెలిపారు. ఆసక్తి కలవారు 95334 29770 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా కానీ నేరుగా కానీ దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

ప్రజాశక్తి- భోగాపురం (విజయనగరం జిల్లా)

విశాఖపట్నంలో జరిగే బంధువుల పెళ్లి కోసం చెన్నై నుంచి కుటుంబమంతా కలిసి రెండు రోజుల కిందట వచ్చారు. శ్రీకాకుళం జిల్లాలో ఉన్న పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి కారు ఢీకొంది. దీంతో దంపతులు అక్కడకక్కడే మృతి చెందారు. వారి కుమారుడికి స్వల్ప, కోడలికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషాదకర సంఘటన భోగాపురం మండలం లింగాలవలస పెట్రోల్ బంకు సమీపంలో జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం చోటుచేసుకుంది.

తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన అశోక్‌కుమార్ విశాఖపట్నంలో బంధువుల పెళ్లికి తల్లిదండ్రులు, భార్యతో కలిసి రెండు రోజుల క్రితం వచ్చాడు. గురువారం ఉదయం అశోక్‌కుమార్ కారులో వారంతా శ్రీకాకుళం జిల్లాలోని పుణ్యక్షేత్రాలను కలిసి దర్శించుకుని, తిరుగు పయనమయ్యారు. లింగాలవలస పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి కారు బలంగా ఢీకొంది. దీంతో కారులో ఎడమవైపు కూర్చున్న తండ్రి నగిశెట్టి యాదవ్ కుమార్ (82), వెనుక సీట్లో కూర్చున్న తల్లి శ్రీలీల (71) అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవింగ్ చేస్తున్న అశోక్ కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఆయన వెనుక సీట్లో కూర్చున్న భార్య ప్రసన్నకు తీవ్ర గాయాలయ్యాయి. విజయనగరంలోని ఒక ప్రయివేట్ ఆస్పత్రికి వారిని తరలించారు. ఈ సమాచారం అందుకున్న సిఐ ప్రభాకర్, ఎస్ఐ సూర్యకుమారి, హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. ప్రమాదం కారణంగా ఏర్పడిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కారులో చిక్కుకున్న మృతదేహాలు

లారీని వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో కారు ఎడమ భాగమంతా నుజ్జునుజ్జయింది. దీంతో భార్యాభర్తల మృతదేహాలు అందులో చిక్కుకున్నాయి. అటుగా వెళుతున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు సంఘటనా స్థలానికి వెళ్లి, బాధితులకు సహాయక చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. ఊరు కాని ఊరు వచ్చి భార్యభర్తలు ఇక్కడ మృతి చెందడంతో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. ప్రమాదానికి అతివేగమే కారణమై ఉండొచ్చని సిఐ ప్రభాకర్ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

జనవరి 31 నుంచి అరకు ఉత్సవాలు

ప్రజాశక్తి-పాడేరు: జనవరి 31వ తేదీ నుండి మూడు రోజుల పాటు అరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా పర్యాటక మండలి చైర్మన్ ఎఎస్ దినేష్ కుమార్ ప్రకటించారు. అల్లూరి జిల్లా కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన గురువారం జరిగిన పర్యాటక అభివృద్ధి సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. మారేడుమిల్లి ఉత్సవాలు ఫిబ్రవరి 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా అరకు, బొర్రా గుహలను ప్లాస్టిక్ ఫ్రీ డెస్టినేషన్‌గా ప్రకటించడం జరిగిందన్నారు. ఆయా ప్రాంతాలను సందర్శించే పర్యాటకులు ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఆయా ప్రాంతాలలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగం, కొనడం, అమ్మడం లాంటివి నిషిద్ధమని స్పష్టం చేశారు. ఈ నిబంధనలు జనవరి ఒకటి నుండి అమలులోకి వస్తాయని తెలిపారు. అరకు, మారేడుమిల్లి ఉత్సవాల నిర్వహణకు మూడేసి కోట్ల రూపాయలు మంజూరు చేయాల్సిందిగా ప్రభుత్వానికి నివేదికలు సమర్పించామన్నారు.

సెమీస్‌కు యుపి, పట్నా

ప్రొ కబడ్డీ సీజన్-11



పూణే: ప్రొ కబడ్డీ సీజన్-11 సెమీ ఫైనల్లోకి యుపి యోధాస్, పట్నా పైరెట్స్ జట్లు ప్రవేశించాయి.

గురువారం జరిగిన ప్లే-ఆఫ్స్ పోటీల్లో యుపి యోధాస్ జట్టు 46-18పాయింట్ల తేడాతో జైపూర్ పింక్ ప్యాంథర్స్‌ను, పట్నా పైరెట్స్ 31-23 పాయింట్ల తేడాతో యు ముంబను చిత్తుచేశాయి. ఏకపక్షంగా జరిగిన తొలి ప్లే-ఆఫ్ మ్యాచ్‌లో యుపి రైడర్ భవాని రాజ్‌పుట్(12)రైడ్స్‌లో రాణించగా.. హితేశ్ ట్యాకిల్స్‌లో మెరిసాడు. ఇక యుపి జట్టు ఎనిమిదిసార్లు ప్రత్యర్థి జైపూర్ జట్టును ఆలౌట్ చేసింది. రైడ్‌ల ద్వారా 18, ట్యాకిల్స్ ద్వారా మరో 18పాయింట్లను చేజిక్కించుకుంది. ఇక జైపూర్ జట్టు రైడ్‌ల ద్వారా 12పాయింట్లు సాధించినా.. ట్యాకిల్స్‌లో కేవలం 5పాయింట్లు మాత్రమే సాధించగల్గింది. జైపూర్ రైడర్ రేజా(5) మాత్రమే రాణించాడు. ఇక రెండో ప్లే-ఆఫ్ మ్యాచ్‌లో పట్నా పైరెట్స్ రైడర్ అయాన్(10 పాయింట్లు)కి తోడు గుర్‌దీప్ ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచాడు.

సెమీఫైనల్స్ నేడు..

హర్యానా స్టీలర్స్ × యుపి యోధాస్(రాత్రి 8.00గం॥లకు)

దబాంగ్ ఢిల్లీ × పట్నా పైరెట్స్(రాత్రి 9.00గం॥లకు)

అదరగొట్టిన ఆంధ్ర

- సిక్కింపై ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపు
- విజయ్ హజారే వన్డే టోర్నమెంట్



ముంబయి: విజయ్ హజారే టోర్నీ లీగ్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు అదరగొట్టింది. గ్రూప్-బిలో భాగంగా సిక్కింతో గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన సిక్కింను ఆంధ్ర బౌలరుకట్టడి చేశారు. దీంతో సిక్కిం జట్టు 32.2ఓవర్లలో 119పరుగులకే కుప్పకూలింది. సత్యనారాయణరాజు(3/32), సాయి రాహుల్(2/12), స్టెఫెన్(2/24) బౌలింగ్‌లో రాణించారు. ఆ లక్ష్యాన్ని ఆంధ్ర జట్టు 20.4ఓవర్లలో కేవలం 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. రికీ బుయ్(41నాటౌట్), మహీప్ కుమార్(23నాటౌట్)కి తోడు అశ్విన్ హెబ్బర్(27) బ్యాటింగ్‌లో రాణించారు. ఈ గెలుపులో ఆంధ్ర జట్టు గ్రూప్-బిలో 3 మ్యాచ్‌లు ముగిసేసరికి 8పాయింట్లతో 2వ స్థానానికి ఎగబాకింది.

హైదరాబాద్‌కు మరో ఓటమి

గ్రూప్-సిలో హైదరాబాద్ జట్టు మరో ఓటమిని చవిచూసింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో సౌరాష్ట్ర చేతిలో హైదరాబాద్ జట్టు 6వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. హైదరాబాద్ జట్టు 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 244పరుగులు చేయగా.. సౌరాష్ట్ర జట్టు 42.5ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 248పరుగులు చేసి విజయం సాధించింది. సౌరాష్ట్ర బ్యాటర్ హార్విక్ దేశాయ్(125నాటౌట్) సెంచరీకి తోడు గోహిల్(60) బ్యాటింగ్‌లో రాణించారు. శనివారం జరిగే నాల్గో లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు పాండిచేరితో, ఆంధ్ర జట్టు సర్వీసెస్‌తో తలపడనున్నాయి.

జల రాకాసి సునామీకి 20ఏళ్ళు !

- ఆసియా అంతటా సంస్మరణ కార్యక్రమాలు

బందా ఏక్, ఇండోనేషియా : ఆసియాలో లక్షలాదిమందిని పొట్టనబెట్టుకున్న జల రాకాసి సునామీ సంభవించి గురువారానికి సరిగ్గా 20ఏళ్ళు. ఈ జల ప్రళయంలో 2,20,000మందికి పైగా మరణించారు. హిందూ మహా సముద్రం చుట్టుపక్కల తీర ప్రాంతాలన్నింటినీ కబళించేసిన రాకాసి అలలు మానవాళి చరిత్రలో కనివినీ ఎరుగని విధ్వంసాన్ని సృష్టించాయి.

2004 డిసెంబరు 26 ఉదయం ఇండోనేషియాలోని పశ్చిమ తీరంలో సముద్ర గర్భంలో 9.1 తీవ్రతతో పెను భూకంపం సంభవించింది. ఈ తీవ్రతకు సముద్రపుటలలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. ఇండోనేషియా నుండి సోమాలియా వరకు మొత్తంగా 14 దేశాల తీర ప్రాంతాల్లో విలయం సృష్టించాయి.

ఆనాటి విషాదంలో అసువులు బాసిన వారి సంస్మరణార్థం ఆసియా వ్యాప్తంగా తీవ్రంగా దెబ్బతిన్న ఇండోనేషియా, శ్రీలంక, భారత్, థాయిలాండ్ దేశాల్లో బీచ్‌ల వద్ద సంస్మరణ సభలు, మతపరమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బాధితుల సమాధుల వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. ఏక్ ప్రావిన్స్‌లో దాదాపు 14వేల మందిని సామూహిక ఖననం చేసిన సమాధి వద్దకు పెద్ద సంఖ్యలో బాధితులు వచ్చారు. తమ వారిని తలచుకుంటూ విలపించారు. బైతురామన్ గ్రాండ్ మసీదు వద్ద సునామీ సంభవించిన సమయానికి సరిగ్గా సైరన్ మోగింది. వెంటనే ఆ ప్రాంత వ్యాప్తంగా సంస్మరణ కార్యక్రమాలు మొదలయ్యాయి. మరోసారి అటువంటి మానవ మహా విషాదాన్ని భరించే స్థైర్యం లేదని, ఇలాంటి విపత్తులు పునరావృతం కాకూడదని బాధిత కుటుంబాలు ప్రార్థనలు చేశాయి. ఈ దారుణం జరిగి రెండు దశాబ్దాలు గడిచినా నిన్నో మొన్నో జరిగినట్లు అనిపిస్తోందని వారు పేర్కొంటున్నారు. క్రిస్మస్ వేడుకలను బీచ్‌ల్లో జరిపేందుకు విదేశాల నుండి వచ్చిన వారు కూడా ఈ దుర్ఘటన బారిన పడడంతో ప్రపంచవ్యాప్తంగా బాధితులు వున్నారు. ఎలాంటి ముందస్తు హెచ్చరిక లేకుండానే బుల్లెట్ రైలు వేగానికి రెట్టింపు వేగంతో చెలియలి కట్టను దాటి దూసుకు వచ్చిన అలలు అనూహ్యమైన రీతిలో నష్టాన్ని మిగిల్చాయి. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్ళే సమయం కూడా ఇవ్వలేదు. గంటల వ్యవధిలో అలలు దేశాలను చుట్టేశాయి.

మొత్తంగా 2,26,408మంది మరణించినట్లు గుర్తింపు పొందిన గ్లోబల్ డిజాస్టర్ డేటాబేస్ ఇఎం-డిఎటి తెలిపింది. ఇండోనేషియా అత్యధికంగా నష్టపోయింది. 1,60,000మందికి పైగా ఇక్కడ మరణించారు. ఏక్ ప్రావిన్స్ రాజధాని బందా ఏక్‌లో గ్రాండ్ సమాధి వద్ద సామూహిక ప్రార్ధనలు నిర్వహించారు. 35వేల మంది మరణించిన శ్రీలంకలో కూడా పలు సంస్మరణ కార్యకలాపాలు జరిగాయి. అలల ధాటికి పట్టాలు తప్పిన రైలు ప్రమాదంలో దాదాపు వెయ్యిమంది మరణించారు. ఆ ప్రమాదానికి గుర్తుగా కొలంబోకు 90కిలోమీటర్ల దూరంలో ఓషన్ క్వీన్ ఎక్స్‌ప్రెస్‌ను ఎక్కి సంఘటనా స్థలం వద్దకు వెళ్ళనున్నారు. థాయిలాండ్‌లో మరణించిన వారిలో 5వేల మందికి పైగా విదేశీ పర్యాటకులే వున్నారు. ఇక్కడ అధికార కార్యక్రమంతో పాటు పలు అనధికారిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. సునామీ ఎగ్జిబిషన్, డాక్యుమెంటరీ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. అల రూపంలో నిర్మించిన గోడపై బాధితుల పేర్లతో ఫలకాలు రూపొందించారు. అక్కడ బాధితులు పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు.


పెదజాలారిపేటలో పూజలు చేస్తున్న మత్స్యకార మహిళలు

విశాఖపట్నంలోనూ..

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

2004 డిసెంబరు 26వ తేదీ నాటి సునామీ బీభత్సానికి గురువారంతో 20 ఏళ్లయిన సందర్భంగా విశాఖలో గంగమ్మ తల్లి పండగ నిర్వహించారు. ఈ బీభత్సం కారణంగా రాష్ట్రంలో మొత్తం 105 మంది ప్రాణాలు కోల్పోయినా విశాఖ తీరంలో మాత్రం చెక్కుచెదరలేదు. సహజ సిద్ధంగా ఏర్పడిన డాల్ఫిన్ నోస్, సముద్రంలోకి చొచ్చుకొచ్చినట్లుండే కొండల కారణంగా విశాఖ నగరానికి నష్టం తప్పిందని భావిస్తుంటారు. పెద్దజాలరిపేట వద్ద సముద్ర తీరంలో గురువారం మత్స్యకారులు గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.. సునామీ వచ్చి పోయినప్పటి నుంచి సముద్ర తీరంలో పూజలు చేస్తున్నట్లు మహిళలు తెలిపారు. విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, టిడిపి నాయకులు అక్కరమాని వెంకట్రావు ముఖ్య అతిథులుగా హాజరై పూజలు నిర్వహించారు.


విజేతలతో రాష్ట్రపతి

17 మందికి బాల్‌పురస్కార్ ప్రదానం

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులను గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. అసాధారణ విజయాలు సాధించిన 17 మంది చిన్నారులు ఈ అవార్డులను అందుకున్నారు. వీరిలో గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన ఆర్టిస్టిక్ రోలర్, స్కేటింగ్ క్రీడాకారిణి జెస్సీ రాజ్ కూడా ఉన్నారు. రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో ఈ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ చిన్నారుల్లో దేశభక్తి ఉదంతాలు మన దేశ భవిష్యత్తుపై విశ్వాసాన్ని మరింత బలపరుస్తాయని అన్నారు.

ఎంఎబిఎంపై నిషేధం సరికాదు

- సామాజికవేత్తలు, మేధావులు

రాయ్‌పూర్ : ఆదివాసీ రైతుల మూలవాసి బచావో మంచ్ (ఎంబిఎం)ను 'చట్ట విరుద్ధమైన సంస్థ'గా ప్రకటిస్తూ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ప్రత్యేక ప్రజా భద్రతా చట్టం (సిఎస్‌పిఎస్‌ఎ) గత నెల 8న నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత అభివృద్ధి పనులను సంస్థ వ్యతిరేకించటం, భద్రతా శిబిరాల ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించటం అనే రెండింటిని ఈ చర్యకు కారణాలుగా నోటిఫికేషన్ పేర్కొంటూ ఒక సంవత్సరం పాటు ఈ ఏకపక్ష నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుందని వివరించింది. ఈ విషయంలో ఎంబిఎంకు ఎలాంటి అవకాశమూ లేకుండా వ్యవహరించింది. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిఎస్‌పిఎస్‌ఎ కింద ఎంబిఎంపై నిషేధాన్ని పలువురు తప్పుబడుతున్నారు. నోటిఫికేషన్ రాజ్యాంగ విరుద్ధమైనదిగా పేర్కొంటున్నారు. వ్యక్తులు, సంస్థల కొన్ని చట్టవిరుద్ధమై కార్యకలాపాలను సమర్థవంతంగా నిరోధించటం కోసం 2005లో సిఎస్‌పిఎస్‌ఎను రాష్ట్రంలో అమలులోకి తీసుకొచ్చారు. అయితే, ఎంబిఎం ఎలాంటి చర్యలకు పాల్పడింది? ఎలాంటి హింసను ప్రేరేపించింది? అన్నది ఆరోపించకుండానే ఎంపిఎంపై నిషేధం విధించటం గమనార్హం. కేంద్ర, రాష్ట్ర అభివృద్ధి పనుల పట్ల వ్యతిరేకత అనేది చట్టవిరుద్ధమైన చర్య ఎలా అవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిని ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా అభివర్ణిస్తున్నారు.

అభివృద్ధి పేరుతో ప్రజా నిధుల దుర్వినియోగం, వనరుల వెలికితీత అనేవి.. పర్యావరణ విధ్వంసం, ఎస్టీలను ఐదో షెడ్యూల్ భూముల నుంచి పెద్ద ఎత్తున తరలించే ప్రమాదానికి దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంబిఎం నిషేధాన్ని అమలులోకి తీసుకురావటానికి ముందు ఏ న్యాయమూర్తులూ నిషేధ ప్రతిపాదనను సమీక్షించలేదని, నిషేధం ఎలా విధిస్తారని ప్రశ్నిస్తున్నారు.

బిజెపి ఎమ్మెల్యేపై కోడిగుడ్లతో దాడి



బెంగళూరు: కర్ణాటక మాజీ మంత్రి, ఆర్ ఆర్ నగర్ ఎమ్మెల్యే మునిరత్న నాయుడిపై కొందరు కోడిగుడ్డతో విసిరారు. అత్యాచారం కేసులో జైలుకు వెళ్లి మునిరత్న బెయిల్ మీద బయటకు వచ్చి రెండు నెలలు అయ్యింది. అయితే అప్పటి నుంచి ఆయనకు ప్రజల్లోకి వచ్చింది ఇదే తొలిసారికాగా.. ఆ టైంలోనే దాడి జరగడం గమనార్హం. లక్ష్మీ నగర్‌లో నిర్వహించిన వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల్లో మునిరత్న పాల్గొన్నారు. తిరిగి తన అనుచరులతో వెళ్తున్న సమయంలో కొందరు వ్యక్తులు ఆయనపైకి గుడ్డు విసిరారు. ఆపై మంటతో కాసేపు ఆయన విలవిలలాడిపోయారు. దీంతో పోలీసులు ఆస్పత్రికి తరలించగా.. అక్కడ ఆయనకు రకరకాల వైద్య పరీక్షలు జరిపారు. అర్ధరాత్రి పూట వైద్యులు డిశ్చార్జి చేశారు. మునిరత్న నాయుడు రాజకీయాలతోనే కాదు.. సినిమాలతోనూ పేరు సంపాదించుకున్నారు. ఉపేంద్ర, దర్శన్ లాంటి అగ్ర నటులతో ఆయన చిత్రాలను నిర్మించారు. అయితే ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఆయనపై అనూహ్యమైన ఆరోపణలు వచ్చాయి. సోషల్ వర్కర్‌గా పని చేసే ఓ మహిళ(40) ఫిర్యాదుతో పలు నేరాల కింద కేసు నమోదయ్యింది. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు కింద మూడు రోజులుల్లో ఉండి బయటకు వచ్చారాయన. అయితే బయటకు వచ్చి కొన్నినిమిషాలకే.. అత్యాచారం కేసు లో ఆయన్ని మరోసారి అరెస్ట్ చేశారు. అక్టోబర్ మూడో వారంలో ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం బెయిల్ మంజారు చేసింది.

ప్రజా సమస్యలపై పోరాటం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కారమయ్యే వరకూ పోరాటం చేస్తానని, మనకు అన్యాయం జరిగితే న్యాయపరంగా ముందుకు వెళ్దామని, ఎవరు అధైర్య పడకుండా ముందుకు వెళ్లాలన్నారు.

కిటికీ అద్దాలు ధ్వంసం

తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించేందుకు జగన్ వచ్చిన వెంటనే ఆయనను కలిసేందుకు భారీగా జనం రావడంతో తోపులాట జరిగింది. ఈ క్రమంలో కార్యాలయం కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు ఎంత చెప్పినా ప్రజలు వినకపోవడంతో పరిస్థితిని అదుపు చేసేందుకు లాఠీఛార్జ్ చేశారు. ప్రజలను కంట్రోల్ చేయడానికి రోప్‌ను తీసుకువచ్చి అదుపు చేశారు. తర్వాత ప్రజాదర్బార్ ప్రశాంతంగా జరిగింది.

చేసిన తప్పును అంగీకరించడానికి మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదు

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేస్తామన్నారు. కేవలం కఠోర శ్రమ ఒక్కటే సరిపోదన్నారు. సకాలంలో నిర్దిష్ట వ్యూహాలు, దిశా నిర్దేశాలు అవసరమన్నారు. కొత్త వారికి అవకాశం ఇవ్వాల్సిన అవసరం వుందన్నారు. స్థానిక, కొత్త నాయకత్వాన్ని పెంచి పోషించాల్సిన అవసరం కూడా వుందన్నారు. కాంగ్రెస్‌కు సైద్ధాంతిక బలం వుందన్నారు. గాంధీ, నెహ్రూ సహా గొప్ప వీరుల ఘనమైన వారసత్వం వుందన్నారు. సరికొత్త సందేశం, తీర్మానంతో ఇక్కడ నుండి వెళతామన్నారు.

సమావేశానికి హాజరుకాలేకపోయిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సిపిపి) చీఫ్ సోనియా గాంధీ తరపున ఆమె సందేశం సమావేశంలో చదివి వినిపించారు. మహాత్మాగాంధీ వారసత్వాన్ని పరిరక్షించుకుంటూ పునరంకితం కావడానికి నేడు మనం అంకితం కావాలన్నారు. ఆయన ఎన్నటికీ మనందరికీ స్ఫూర్తిదాతగా వుంటారన్నారు.

ఉద్యోగార్థులపై విరిగిన లాఠీ

(మొదటి పేజీ తరువాయి)

గ్రూప్-2 పోస్టులకు పరీక్ష నిర్వహించారు.. అయితే ఈ పరీక్షా పత్రం లీకయిందని వార్తలు గుప్పుమనడంతో అభ్యర్థులు ఆందోళనతో వీధుల్లోకి వచ్చారు. 13న జరిగిన పరీక్షను రద్దు చేసి, తిరిగి తాజాగా పరీక్ష నిర్వహించాలని కోరుతూ రెండు వారాల నుంచి గార్దానీ బాగ్‌లోని ధర్నా స్థలిలో ఆందోళన నిర్వహిస్తున్నారు. అయినా, పభుత్వం నుంచి ఎలాంటి చలనం లేదు. దీంతో బుధవారం పాట్నాలోని పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయానికి వారు మార్చ్ నిర్వహించారు.. విషయం తెలిసి అక్కడకు చేరుకున్న పోలీసులు వారిపై పైశాచిక లాఠీచార్జి చేశారు.

ఉద్యోగార్థులపై పోలీసుల దాడిని ఆర్‌జెడి అధ్యక్షులు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. పోలీసుల పాశవిక చర్యను లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు.. దీనికి తాజా ఉదాహరణ బీహార్' అని తెలిపారు. 'తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఎన్‌డిఎ ప్రభుత్వం విద్యార్థులపై లాఠీచార్జికి పాల్పడుతోంది. ఇది చాలా సిగ్గు చేటు. ఖండించితగ్గనిది. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవడాన్ని మేం సహించం. న్యాయం కోసం వారితో కలిసి పోరాడుతాం' అని రాహుల్ తెలిపారు. అలాగే విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జీ చేస్తున్న వీడియోను కూడా పోస్టు చేశారు.

ఉద్యోగార్థులపై లాఠీఛార్జీ చేయడాన్ని పోలీసులు నిస్సిగ్గుగా సమర్థించుకున్నారు.. బుధవారం ఆందోళనలో పాల్గొన్న వారిని గుర్తించి, వారిపై కేసు నమోదు చేస్తామని డిఎస్‌పి వెల్లడించారు.

ఉత్తరాదిపై చలిపులి

- పలు రైళ్ల ఆలస్యం, రద్దు
- ఈ నెలఖరు వరకూ ఇదే పరిస్థితి : ఐఎండి

న్యూఢిల్లీ : ఉత్తరాదిపై చలిపులి పంజా విసురుతోంది. అనేక ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. ఉష్ణోగ్రతలు దిగజారడం, భారీ హిమపాతంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేశరాజధాని ఢిల్లీతో పాటు రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, జమ్ముకాశ్మీర్‌లో చలితీవ్రంగా ఉంది. ఢిల్లీ నగరం గురువారం ఉదయం వరకూ దట్టమైన పొగమంచు కిందే ఉంది. ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రత 7 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. గురువారం గరిష్ట ఉష్ణోగ్రత 22.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయింది. ఉత్తరప్రదేశ్‌లోని అనేక నగరాలు, రాజస్థాన్‌లోని జైపూర్‌ల్లోనూ దట్టంగా పొగమంచు పరుచుకుంది.

రవాణా వ్యవస్థ కూడా స్థంభిస్తోంది. రోడ్లు మూసివేశారు. పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. కొన్ని రైళ్లను రద్దు చేశారు. కాగా, ఈ నెలాఖరు వరకూ ఇదే పరిస్థితి ఉంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) హెచ్చరించింది. జమ్ముకాశ్మీర్‌లో వచ్చే రెండు రోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు రెండు, మూడు డిగ్రీల సెల్సియస్‌కు పడిపోతాయని ఐఎండి అంచనా వేసింది.

70గంటలకు పైగా బోరుబావిలోనే చిన్నారి..

- కొనసాగుతోన్న ఆపరేషన్

జైపూర్: పొలంలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు బోరుబావిలో పడిపోయిన మూడేళ్ల చిన్నారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రాజస్థాన్‌లోనికోర్‌పుట్లీ-బెహ్రార్ జిల్లాలో చేతన అనే చిన్నారి ఆడుకుంటూ సోమవారం 700 అడుగుల బోరుబావిలో పడిపోయింది. 150 అడుగుల లోతు వద్ద బాలిక చిక్కుకునట్లు అధికారులు గుర్తించారు. గురువారం రాత్రి వరకూ బాలికను రక్షించడానికి ప్రయత్నిస్తున్నారు. తొలుత కుటుంబ సభ్యులు ఆ పాపను రక్షించేందుకు యత్నించగా.. మరింత కిందకు జారుకుంది. ఈ క్రమంలోనే ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, స్థానిక పోలీసు సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. పైపుతో బోరుబావిలోకి ఆక్సిజన్ పంపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు, బోరుబావి ఇరుకుగా ఉండటంతో చిన్నారికి ఆహారం, నీరు సరఫరా చేయడంలో ఇబ్బంది నెలకొంది. దీంతో సమయం గడుస్తున్న కొద్దీ చిన్నారి పరిస్థితిపై ఆందోళన మరింతగా పెరుగుతోంది. బుధవారం ఉదయం నుంచి బోరుబావికి సమాంతరంగా సొరంగం తవ్వుతున్నారు. తద్వారా బాలిక వద్దకు నిపుణులు చేరుకొనేలా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. బాలిక సురక్షితంగా ప్రాణాలతో బయటపడాలని కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు అందరూ కోరుకుంటున్నారు. బాలిక తల్లి ఆహారం కూడా తీసుకోకుండా రోదిస్తూ ఎదురుచూస్తుండటం అందర్నీ కలిచివేస్తోంది.

అరేబియాలో మునిగిన నౌక..

- తొమ్మిది మందిని కాపాడిన కోస్ట్‌గార్డ్

ముంబయి : అరేబియా సముద్రంలో కల్లోల వాతావరణ పరిస్థితుల కారణంగా ఓ నౌక మునిగి పోగా.. అందులోని తొమ్మిది మంది సిబ్బందిని కోస్ట్‌గార్డ్ సురక్షితంగా కాపాడింది. పాకిస్థాన్ సహకారంతో రెస్క్యూ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తిచేసినట్లు వెల్లడించింది. గుజరాత్‌లోని ముంద్రా నుంచి యెమెన్‌లోని సొకొత్రా ద్వీపానికి ప్రయాణం చేస్తున్న ఎంఎస్‌వి తాజ్‌ధారే హరామ్ అనే నౌక ఈ ప్రమాదానికి గురయింది. గుజరాత్‌లోని పోరుబందర్‌కు సుమారు 311 కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. తమను కాపాడాలంటూ అందులోని తొమ్మిది మంది సిబ్బంది అత్యవసర సందేశం పంపారు. రోజువారీ నిఘా కార్యకలాపాల్లో భాగంగా చక్కర్లు కొడుతున్న 'ఐసీజీ డోర్నియర్' దీన్ని గుర్తించి.. సమీపంలో పెట్రోలింగ్‌లో ఉన్న ఐసీజీ నౌక 'శూర్'ను వెంటనే రంగంలోకి దిగింది.



ప్రభుత్వ లాంఛనాలతో వాసుదేవన్ నాయర్ అంత్యక్రియలు

- విజయన్, ఇతర మంత్రుల నివాళి

కోజికోడ్ : ప్రముఖ మలయాళ రచయిత ఎంటి వాసుదేవన్ నాయర్ అంత్యక్రియలను గురువారం ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. కోజికోడ్‌లోని స్మృతి పథం వద్ద వాసుదేవన్ నాయర్‌కు కుమార్తె అస్వతి, సమీప బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు. బుధవారం రాత్రి వాసుదేవన్ ఆసుపత్రిలో మరణించిన సంగతి తెలిసిందే. ఆసుపత్రి నుంచి వాసుదేవన్ భౌతిక కాయాన్ని కోజికోడ్‌లోని నడక్కువు వద్ద ఉన్న ఆయన నివాసం వద్దకు తీసుకుని వెళ్లారు. నివాసం వద్ద గురువారం ఉదయం కేరళ ముఖ్యమంత్రి విజయన్, స్పీకర్ ఎఎన్. షంసీర్, మంత్రులు కెఎన్ బాలగోపాల్, సజి చెరైన్, మహ్మద్ రియాస్, ఎంబి రాజేష్, పి.ప్రసాద్, కె.క్రిష్ణకుట్టి, ఎకె ససీంద్ర భౌతిక కాయం వద్ద నివాళి అర్పించారు. అలాగే గోవా గవర్నర్ శ్రీధరన్ పిళ్లై, నటులు మోహన్‌లాల్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ రాష్ట్ర అధ్యక్షులు పనక్కడ్ సయ్యద్ సదికలి షిహబ్ తంగల్, దర్శకులు టికె రాజీవ్‌కుమార్, అభిమానులు నివాళులర్పించారు.

ఉన్నత విద్యాశాఖ సెక్రెటరీగా మణిపూర్ సిఎస్ వినీత్ జోషి

న్యూఢిల్లీ : మణిపూర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సిఎస్) వినీత్ జోషికి కేంద్రం స్థాన చలనం కల్పించింది. ఆయనను ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా నియమించింది. హోం శాఖ మాజీ సెక్రెటరీ అజయ్ కుమార్ భల్లాను మణిపూర్ రాష్ట్ర గవర్నర్‌గా కేంద్రం నియమించిన మరుసటి రోజే ఇది చోటు చేసుకోవటం గమనార్హం. వినీత్ జోషి.. 1992 బ్యాచ్ మణిపూర్ క్యాడర్ అధికారి. ఏడాదిన్నర క్రితమే, అంటే గతేడాది మేలో మణిపూర్‌లో చెలరేగిన జాతి హింస ఘర్షణల తర్వాత పరిస్థితిని చక్కదిద్దేందుకు వినీత్ జోషిని రాష్ట్రానికి పంపారు. ఏడాదిన్నర క్రితమే అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజేశ్ కుమార్ స్థానంలో వినీత్ జోషి నియమితులయ్యారు. ఆ సమయంలో ఆయన నీట్, జేఈఈ మెయిన్ వంటి మెడికల్, ఇంజినీరింగ్ ప్రవేశపరీక్షలను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)కు చీఫ్‌గా ఉన్నారు. కాగా, మణిపూర్‌లో జాతి హింస అనంతర గొడవలు ఇప్పటికీ కొనసాగుతున్న విషయం విదితమే. ఇలాంటి తరుణంలో వినీత్ జోషిని కేంద్రం వెనక్కి పిలవటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.సమర్థవంతమైన అధికారిగా వినీత్ జోషికి పేరున్నది. ఆయనకు విద్యాశాఖ కొత్తేమీ కాదు. గతంలో కేంద్ర డిప్యూటేషన్‌లో ఆయన ఉన్నత విద్యాశాఖలో అదనపు కార్యదర్శిగా పని చేశారు. ప్రస్తుతం కేంద్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా ఉన్న కె. సంజయ్ మూర్తి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఆఫ్ ఇండియాగా నియమితులయ్యారు. దీంతో ఖాళీ అయిన ఈ స్థానాన్ని వినీత్ జోషి భర్తీ చేయనున్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్

- బ్రహ్మపుత్రపై నిర్మాణానికి చైనా ఆమోదం

బీజింగ్ : ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్ నిర్మాణానికి చైనా ఆమోద ముద్ర వేసింది. టిబెట్‌లోని బ్రహ్మపుత్ర నదిపై 137 బిలియన్ల డాలర్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన ఈ ప్రాజెక్టు భారత సరిహద్దుకు అత్యంత సమీపంలో వుంది. బ్రహ్మపుత్ర నదిని టిబెట్‌లో యార్లంగ్ జంగ్పోగా పిలుస్తారు. ఆ నదీ దిగువ ప్రాంతంలో పెద్ద జల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి చైనా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు ప్రపంచంలో అతిపెద్ద డ్యామ్‌గా భావించే త్రీ గోర్జెస్ డ్యామ్‌కు ఇది దాదాపు మూడు రెట్లు పెద్దదిగా వుంటుంది.

ఏడాదికి 300 బిలియన్ల కిలోవాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుందని సంబంధిత నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ ప్రాజెక్టుతో టిబెట్‌కు ఏటా 20బిలియన్ల యువాన్ల ఆదాయం లభిస్తుంది. అత్యంత నాణ్యతతో కూడిన అభివృద్ధి పంథాను అనుసరించేందుకు దేశం చేస్తున్న కృషిని మరింత వేగవంతం చేయడంలో ఈ ప్రాజెక్టు సానుకూల పాత్ర పోషిస్తుందని చైనా ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.

ఉక్రెయిన్‌తో చర్చలపై ఆసక్తి లేదు

- రష్యా వైఖరిని స్పష్టం చేసిన లావ్‌రోవ్
- ట్రంప్‌తో చర్చలకు సిద్ధమని వెల్లడి



మాస్కో : ఉక్రెయిన్‌తో యుద్ధం, రాబోయే ట్రంప్ ప్రభుత్వం, సిరియాలో సమస్యలు ఇలా పలు అంశాలపై రష్యా వైఖరిని విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ వెల్లడించారు. వార్షిక ఆన్‌లైన్ పత్రికా సమావేశం సందర్భంగా గురువారం ఆయన పలు అంశాలపై మాట్లాడారు.

'కాల్పుల విరమణను ఎక్కడకు వెళ్ళడానికి దారి లేకపోవడంగా పరిగణిస్తారు. శూన్యమైన చర్చల పట్ల రష్యాకు ఆసక్తి లేదు,' అని లావ్‌రోవ్ ఉక్రెయిన్‌పై వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఉక్రెయిన్‌తో కుదిరే ఒప్పందాల్లో తప్పనిసరిగా ఉల్లంఘనలను నిరోధించే యంత్రాంగాలు వుండాలని ఆయన అభిప్రాయపడ్డారు.

ట్రంప్ ప్రభుత్వంతో చర్చలకు రష్యా సిద్ధంగానే వుందన్నారు. ఘర్షణలకు గల మూల కారణాలను అర్ధం చేసుకోవాలని ఆశిస్తున్నామన్నారు. కీవ్ జోక్యం లేకుండా ఉక్రెయిన్‌పై చర్చించేందుకు ఫ్రాన్స్ నుండి అనేక ప్రైవేటు ప్రతిపాదనలు అందాయన్నారు. అయితే కీవ్‌కు ఒక పక్క సైనికపరంగా మద్దతు కొనసాగిస్తూనే మరోవైపు ఫ్రాన్స్ ఇలా వ్యవహరించడం సందేహాలకు తావిచ్చిందన్నారు. రష్యాకు గల ముప్పుల ప్రాతిపదికనే ఉక్రెయిన్‌లో దాడి లక్ష్యాలను ఎంపిక చేసుకుంటామని చెప్పారు.

అధికారంలో ఎవరు వున్నా దానితో నిమిత్తం లేకుండా రష్యాను నియంత్రించడానికి అమెరికా ప్రయత్నిస్తూనే వుంటుందని లావ్‌రోవ్ చెప్పారు. ట్రంప్ బృందం నుండి వస్తున్న సంకేతాలను బట్టి వారు చర్చలు జరిపేందుకు ఆసక్తిగా వున్నట్లు కనిపిస్తోందని, కానీ మొదటి చర్య అమెరికా నుండే రావాలని లావ్‌రోవ్ స్పష్టం చేశారు.

ఇయు దేశాలతో పరస్పర లబ్ధితో కూడిన ఒప్పందాలు చేసుకునేందుకు రష్యా కూడా సుముఖంగా వుందన్నారు. సిరియా కొత్త ప్రభుత్వంతో రష్యా సంబంధాలు కొనసాగిస్తుందని చెప్పారు. ఆర్థిక సహకారాన్ని కూడా పునరుద్ధరిస్తుందని చెప్పారు. సిరియాలో ఎన్నికలను నిర్వహించేందుకు మాస్కో సాయమందించడానికి సిద్ధంగా వుందన్నారు. సిరియా విచ్ఛిన్నమవడాన్ని రష్యా తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు.

ప్రముఖ పాక్ రచయిత బాప్సి సిధ్వా కన్నుమూత



హోస్టన్ : పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ రచయిత బాప్సి సిధ్వా తుదిశ్వాస విడిచారు. ఐస్ క్యాండీ మ్యాన్‌తో ప్రపంచ గుర్తింపు తెచుకున్న బాప్సి కొన్ని ఏళ్లుగా అమెరికాలో ఉంటున్నారు. బుధవారం హోస్టన్‌లో కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. 86 ఏళ్ల బాప్సి సిధ్వాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. 1938 ఆగస్టు 11న కరాచీలో జన్మించిన బాప్సి చిన్నతంలోనే కుటుంబంతో కలిసి లాహోర్‌కు వలస వెళ్లారు. రెండేళ్ల వయస్సులోనే పోలియో బారీన పడ్డారు. కానీ కుటుంబ సహకారంతో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్నారు. వివాహం తరువాత ముంబయి వచ్చినా కొద్దికాలానికి లాహోర్ తిరిగి వెళ్లారు. జీవితంలో ఎక్కువ భాగం లాహోర్‌లోనే గడిపారు. తొలి నవల ది క్రో ఈటర్స్ (1978)తో బాప్సికి విస్తృతమైన గుర్తింపు లభించింది. ది బ్రైడ్ (1982), యాన్ అమెరికన్ బ్రాట్ (1993), సిటీ ఆఫ్ సిన్ అండ్ స్ప్లెండర్: రైటింగ్స్ ఆన్ లాహోర్ (2006) నవలు కూడా ప్రఖ్యాతి పొందాయి. బాప్సి రచనలు చరిత్ర, సంస్కృతి వర్ణనలతో పదునుగా ఉంటాయని ప్రసిద్ధి పొందాయి.

మరో 60మందికి జైలు శిక్షలు

- విధించిన పాక్ మిలటరీ కోర్టులు

ఇస్లామాబాద్ : గతేడాది మే 9న పాకిస్తాన్‌వ్యాప్తంగా చెలరేగిన అల్లర్లలో మిలటరీ స్థావరాలపై జరిగిన హింసాత్మక దాడుల్లో ప్రమేయమున్న మరో 60మంది పౌరులకు పాక్ మిలటరీ కోర్టులు జైలు శిక్షలను విధించాయి. వీరందరికీ రెండు నుండి పదేళ్లపాటు శిక్షలు విధించినట్లు ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పిఆర్) గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. గత వారంలో 25మంది పౌరులకు ఇలాగే శిక్ష విధించారు. ఆనాటి అలర్లకు సంబంధించిన సాక్ష్యాధారాలనినంటినీ పరిశీలించిన మీదట, తగిన రీతిలో చట్టపరమైన ప్రక్రియను ముగించి తర్వాతనే ఫీల్డ్ జనరల్ కోర్టు మార్షల్ ఈ శిక్షలను ప్రకటించారని ఐఎస్‌పిఆర్ ప్రకటన పేర్కొంది. సంబంధిత చట్టాల కిందనే నిందితుల విచారణలు పూర్తయ్యాయని తెలిపింది.

వాటికన్ రాయబారికి ఇజ్రాయిల్ సమన్లు

వాటికన్ సిటీ : గాజాపై ఇజ్రాయిల్ పాల్పడుతున్న వైమానిక దాడులను అత్యంత క్రూరమైన చర్యగా పోప్ ఫ్రాన్సిస్ విమర్శించిన నేపథ్యంలో వాటికన్ రాయబారికి ఇజ్రాయిల్ విదేశాంగ శాఖ సమన్లు జారీ చేసింది. గాజాలో వందలు వేల సంఖ్యలో చోటు చేసుకున్న మరణాలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ తక్షణమే గాజాలోకాల్పుల విరమణ జరగాలని పోప్ పిలుపిచ్చారు. క్రిస్మస్‌కు ముందు ఇచ్చిన సందేశంలో ఆయన ఈ మేరకు పేర్కొన్నారు. ఇది యుద్ధం కాదు, క్రూరత్వమని వ్యాఖ్యానించారు. ఈ విషయమై మాట్లాడేందుకు వాటికన్ సిటీ రాయబారి ఆర్చిబిషప్ ఆడాల్ఫో టిటో యలనాను విదేశాంగ శాఖ డైరెక్టర్ జనరల్ ఇయాల్ బార్ తాల్ మంగళవారం పిలిపించారు. పోప్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈ మేరకు ఇజ్రాయిల్ మీడియా సంస్థలు తెలిపాయి. ఇజ్రాయిల్ ఆర్మీ పాల్పడిన ఊచకోత ఘటనలపై కూలకంషంగా దర్యాప్తు జరగాలని గత నెల్లో పోప్ డిమాండ్ చేశారు. కాగా ఇజ్రాయిల్ ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తోంది. పాలస్తీనా తీవ్రవాదులు పాల్పడిన దుశ్చర్యలను పోప్ పట్టించుకోకపోవడం దురదృష్టకరమని ఇజ్రాయల్ దౌత్యవేత్తలు వ్యాఖ్యానించారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన మృతికి సంతాపంగా ఏడురోజులు సంతాప దినాలు నిర్వహించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం ఉదయం 11 గంటలకు కేంద్ర మంత్రిమండలి భేటీకానుంది. మన్మోహన్ మృతికి సంతాపం తెలపనుంది.

గ్రామీణ భారతావని అభివృద్ధికి తపించిన ఆర్థిక వేత్త

దేశంలో ఆర్థిక సరళీకరణ విధానాలకు రూపకల్పన చేసిన ఆర్థిక వేత్తగా పేరు గడించిన మన్మోహన్ సింగ్ 1991 అక్టోబర్‌లో తొలిసారి రాజ్యసభలో అడుగుపెట్టారు. 1991-96 మధ్యకాలంలో నాటి ప్రధాని పివి నరసింహారావు కేబినెట్‌లో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. దేశంలో సరళీకరణ ఆర్థిక విధానాలకు బీజం పడింది ఈ కాలంలోనే. ఆ తర్వాత 2004-09లో ఐక్య ప్రగతిశీల కూటమి (యుపిఎ) సారథ్యంలో ఏర్పాటైన ప్రభుత్వంలో ప్రధానమంత్రిగా మన్మోమన్‌సింగ్ బాధ్యతలు చేపట్టారు. ఈ కాలంలోనే వామపక్షాలు ప్రధానంగా సిపిఎం చొరవతో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, భూ సేకరణ చట్టం, సమాచార హక్కు చట్టం ప్రగతిశీల చట్టాలను తీసుకొొచ్చి భారతావనిని ప్రత్యేకించి గ్రామీణ భారత్‌లో ప్రజల జీవనోపాధులను పెంపొందించేందుకు ఎనలేని కృషి చేశారు. అమెరికాతో అణు ఒప్పందం కారణంగా యుపిఎ నుంచి వామపక్షాలు బయటకు రాగా..తదనంతరం యుపిఎ-2లోనూ 2009-14 వరకు ప్రధానిగా మన్మోహన్ సింగ్ కొనసాగారు. 1991లో ప్రారంభమైన ఆర్థిక సరళీకరణలో ముఖ్యమైన పాత్ర పోషించారు. ఇందులో ప్రభుత్వ నియంత్రణలను తగ్గించడం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) పెంచడం, భారతదేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచ మార్కెట్లకు తెరిచిన నిర్మాణాత్మక సంస్కరణలను అమలు చేయడం వంటి వాటిలో మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారు. ఆధార్, నగదు బదిలీ పథకం (డిబిటి) వంటి అత్యంత కీలక ప్రాజెక్టులను కూడా మన్మోహన్ హయంలోనే ప్రారంభించడం విశేషం. దేశాన్ని వ్యవసాయ సంక్షోభం నుంచి గట్టున పడేసేందుకు ఏకకాలంలో రూ.60 వేల కోట్ల మేర రైతుల రుణాలను మాఫీ చేసి సరికొత్త రికార్డు సృష్టించింది కూడా మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యుపిఎ 1 హయంలోనే.

మన్మోహన్‌సింగ్ చిత్రమాలిక


2005లో ప్రజాశక్తి రజతోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్


చంద్రబాబుతో..


అప్పటి ప్రధాని పివి నరసింహారావుతో ఆర్థిక మంత్రి హోదాలో..


ఉపరాష్ట్రపతి పదవికి హమీద్ అన్సారీ నామినేషన్ సందర్భంగా..


వాజ్‌పేయి, సోనియా గాంధీలతో..


మన్మోహన్ సింగ్, మోడీ పరస్పర అభివాదం..


రాహుల్ గాంధీతో..


ఏచూరి, రాజాతో..


2004లో తొలిసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేస్తున్న మన్మోహన్ సింగ్

గొప్ప రాజనీతిజ్ఞుడు, ఆర్థికవేత్త

- మన్మోహన్ మృతిపై ప్రముఖుల సంతాపం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గొప్ప రాజనీతిజ్ఞుడు, సునిశిత ఆర్థికవేత్త మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. ఆర్థిక వ్యవస్థను కొత్త పుంతలు తొక్కించారని, నిజాయితీ కలిగిన రాజకీయ వేత్తగా నిలబడ్డారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వేరొక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. మన్మోహన్‌సింగ్ ఏ బాధ్యత తీసుకున్నా... తనదైన ముద్ర వేశారని తెలిపారు. రాష్ట్ర మంత్రులు మండిపల్లి రాంప్రసాదరెడ్డి, కందుల దుర్గేష్, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కొల్లు రవీంద్ర సంతాపం వ్యక్తం చేశారు. గ్లోబల్ మార్కెట్లో దేశాన్ని చేర్చడంలో ఆయన చేసిన కృషి అమోఘమని పేర్కొన్నారు.

గవర్నర్ సంతాపం

గవర్నర్ మహ్మద్ అబ్దుల్ నజీర్ వేరొక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చేసిన ఆర్థిక సంస్కరణలు ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందాయని తెలిపారు.

ప్రీ ప్రొడక్షన్ వర్క్‌లో 'కమల్ 237'

మణిరత్నం, కమల్ కాంబో చిత్రం 'థగ్ లైఫ్' షూటింగ్ ప్రస్తుతం చికాగోలో జరుగుతోంది. ఈ చిత్రంతో పాటు కమల్ 237వ సినిమా కూడా త్వరలో సెట్స్ మీదకు వెళ్లనుంది. యాక్షన్ డైరెక్టర్స్ అన్బరివులు ఈ సినిమాను డైరెక్ట్ చేయబోతున్నారు. క్రేజీ యాక్షన్ సినిమాగా ఈ సినిమా ప్లాన్ చేస్తున్నారని తెలుస్తుంది. ఇది పూర్తి స్థాయి యాక్షన్ భరితంగా తెరకెక్కనుంది. ఈ నేపథ్యంలో చికాగోలో ఉన్న కమల్ హాసన్‌ను కలిసి ప్రీ ప్రొడక్షన్ నిర్మాణ పనుల పురోగతిని అన్బరివులు వివరించారు. ఈ సందర్భంగా తమ అభిమాన హీరోతో దిగిన ఫొటోను సోషల్‌మీడియాలో షేర్ చేశారు.

ప్రభాస్ అభినందనలు గర్వకారణం : ధర్మ

మా 'డ్రింకర్ సాయి' సినిమా విజయవంతం కావాలని నటుడు ప్రభాస్ కోరుకోవటం గర్వకారణం. మా సినిమా నిర్మాతలు ఎంతో కష్టపడి ఈ సినిమాను నిర్మించారు. ప్రొడక్షన్‌లో సక్సెస్ రేట్ చాలా తక్కువని తెలిసినా కథను నమ్మి వారు కాంప్రమైజ్ కాకుండా ప్రొడ్యూస్ చేశారు. చిత్ర యూనిట్ అంతా డబ్బు కోసం కాకుండా సినిమాను ఇష్టపడి వర్క్ చేశాం. నేను హీరో అవుదామనే ఇండస్ట్రీకి వచ్చాను. హీరోగానే నా కెరీర్‌ను కొనసాగిస్తాను. అందులో రాజీపడే ప్రసక్తే లేదు. ఎందుకంటే ఇది నా డ్రీమ్. చిన్న సినిమాల ట్రైలర్, టీజర్ బాగుంటేనే ప్రేక్షకులు థియేటర్లకు వస్తారని తెలుసు. అందుకే అన్ని ప్రమాణాలను పాటించాం. అన్ని తరగతుల ప్రేక్షకులకు మా సినిమా బాగా నచ్చుతుంది. యువత మెచ్చే సినిమా ఇది. శుక్రవారంనాడు సినిమాను థియేటర్లలో విడుదల చేస్తున్నాం. ఇటీవల ప్రభాస్ గారిని కలిశాను. ఆల్ ది బెస్ట్ చెప్పి సినిమా సక్సెస్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఆయన విష్ చేయటం ఎంతో సంతోషాన్నిచ్చింది' అని నటుడు ధర్మ అన్నారు. ధర్మ, ఐశ్వర్య శర్మ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'డ్రింకర్ సాయి'. బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్ అనేది చిత్ర ట్యాగ్‌లైన్. ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరినాథ్ నిర్మించారు. కిరణ్ తిరుమలశెట్టి దర్శకత్వం వహించారు.

సినిమా చరిత్రకు ప్రతిరూపం

- 'మన సినిమా..ఫస్ట్‌రీల్' పుస్తకావిష్కరణలో త్రివిక్రమ్

'నేను సినిమాలకు రాస్తూ, దర్శకుడిని అయ్యే సన్నాహాల్లో ఉన్న రోజుల్లో మద్రాస్‌లో రెంటాల జయదేవ పరిచయమయ్యారు. అప్పట్లో ఆయన ఇండియా టుడేలో పనిచేసేవారు. అందులో ఆయన రాసే ప్రత్యేక సినిమా వ్యాసాలు, సమీక్షలు, ముఖచిత్ర కథనాలు, కాలమ్స్ చూసేవాడిని. చాలా బాగా రాసేవారు. పలుసార్లు కలవటం ద్వారా మా మధ్య స్నేహం మొదలై నేటికీ కొనసాగుతోంది. జయదేవ రాసిన 'మన సినిమా...ఫస్ట్ రీల్'ను చాలా వరకూ చదివాను. సినిమాకు ఫస్ట్ రీల్, ఇంటర్వెల్, క్లైమాక్స్ చాలా ముఖ్యం. పుస్తకానికి 'ఫస్ట్‌రీల్' అని పేరు పెట్టారు. సినిమా చరిత్రను కళ్ల ముందుంచారు. ఎంతో ప్రామాణికంగా తయారుచేశారు' అని సినీ దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్ అన్నారు. ప్రముఖ సినీ రచయిత, నంది పురస్కార గ్రహీత డాక్టర్ రెంటాల జయదేవ రచించిన 'మన సినిమా...ఫస్ట్‌రీల్' గ్రంథాన్ని ఎమెస్కో పబ్లికేషన్స్ ముద్రించింది. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లోని బోయి విజయభారతి వేదికపై ఈ పుస్తకాన్ని త్రివిక్రమ్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఐఆర్ఎస్ అధికారి కృష్ణ కౌండిన్య, సభాధ్యక్షులు ఎమెస్కో విజయ్‌కుమార్‌కు ప్రతులను అందజేశారు. తెలంగాణా భాష, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ఆచార్య డి.చంద్రశేఖర్‌రెడ్డి, ప్రముఖ కవి, విమర్శకులు అఫ్సర్, రచయిత్రి కల్పనా రెంటాల, దర్శకులు దశరథ్, సీనియర్ జర్నలిస్ట్ ఇందిరా పరిమి తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68